22-08-2025, శుక్రవారం
TELTEL/2016/69862
# జనం పవర్
తెలుగు దినపత్రిక
JANAM POWER
సంపుటి: 10 | సంచిక:86 | వెల:05
EDITOR: BANDARI MARUTHI

SRK TV

# కవిత మరో లేఖాస్త్రం..

## కేటీఆర్ కీలక నిర్ణయం

**తార స్థాయికి బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు**

**పార్టీలో తనపై కొందరు కక్షగట్టారు**

**నేను లేఖ రాసిన తర్వాత వేదింపులు ఎక్కువయ్యాయి**

**కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా టీబీజీకేఎస్ నుంచి తొలగింపు**

**సింగరేణి కార్మికులను ఉద్దేశిస్తూ.. అమెరికా నుంచి లేఖ**


**కవిత ఎపిసోడ్‌పై బీఆర్ఎస్‌లో తీవ్ర ఉత్కంఠ**



**జనంపవర్, హైదరాబాద్**

బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు తార స్థాయికి చేరుకొంది. బీఆర్ఎస్ పార్టీ అధినేత కుమారుడు కేటీఆర్‌కు కుమార్తె కల్వకుంట్ల కవిత మధ్య పరిస్థితి ఉప్పు నిప్పుగా మారింది. అలాంటి వేళ.. కవిత ఎపిసోడ్‌పై బీఆర్ఎస్ పార్టీలో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. తాజాగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలు కవితను ఆమె పదవి నుంచి సోదరుడు కేటీఆర్ తొలగించారు. కవిత స్థానంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో అమెరికా పర్యటనలో ఉన్న కల్వకుంట్ల కవిత స్పందించారు. ఆ క్రమంలో సింగరేణి కార్మికులకు కవిత గురువారం ఒక బహిరంగ

..మిగతా 2లో




# బీసీ రిజర్వేషన్లు అటకెక్కించారా?

బీజేపీ, బీఆర్ఎస్‌ను నిందిస్తున్న కాంగ్రెస్

పార్టీల పరంగా రిజర్వేషన్లు అంటూ కొత్త ప్రతిపాదన

బీసీ రిజర్వేషన్లకు అడ్డం పడుతున్నది ఎవరు?

కులగణనతో బీసీల్లో చిగురించిన ఆశలు

తాజాగా పరిణామాలతో అంతా గందరగోళం

ముఖ్యమంత్రి వ్యాఖ్యల్లో లోపించిన స్పష్టత

**జనంపవర్, హైదరాబాద్**

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశం రాజకీయ చర్చకు కేంద్ర బిందువైంది. ఈ అంశంపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు తీవ్ర స్థాయిలో కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో బీసీ రిజర్వేషన్ల ఆలస్యానికి బీజేపీని నిందించినా, తాజాగా బీఆర్ఎస్ హయాంలో చేసిన చట్టమే ఈ సమస్యకు కారణమని

..మిగతా 2లో

# అందుకే కేబుల్స్ కట్

**విద్యుత్ షాక్ ఘటనల నేపథ్యంలోనే.**

**కరెంట్ వైర్లకు దగ్గరగా పెట్టడంతో ప్రమాదాలు**

**గతంలో చాలా సార్లు చెప్పిన మారడం లేదు**

**అందువల్లే కేబుల్స్ కట్ చేయాల్సి వస్తుంది**

**వర్ష కాలంలో సాధ్యమైనంత వరకు జాగ్రత్తగా ఉండాలి**

**అత్యవసర సేవలకు అంతరాయం లేకుండా కేబుల్స్ కట్**

**విద్యుత్ షాక్‌తో ఏడుగురు చనిపోవడం బాధాకరం**

**హైదరాబాద్‌లో సీఎండీ ముషారఫ్ అలీ**

3



## ఆధార్ తరహాలో 'భూధార్'

2

**ప్రతి భూమికీ ప్రత్యేక సంఖ్య**

**తెలంగాణ ప్రభుత్వం కసరత్తు**

**భూమికి సంబంధించి పూర్తి సమాచారం ఒకే చోట**

**ఇది అమలులోకి వస్తే నకిలీ పత్రాల సృష్టికి అడ్డుకట్ట**

**పైలట్ గ్రామాల్లో మొదట భూధార్ కార్డులు జారీ**



2

## హైడ్రా కీలక విజయం

**400 కోట్ల విలువైన ఆస్తులను కాపాడాడిన హైడ్రా**

## త్వరలో రయ్ రయ్!

**తెలుగు రాష్ట్రాలకు బుల్లెట్ రైళ్లు..**

**హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా చెన్నై, బెంగుళూరులకు**

**గంటకు గరిష్ఠంగా 350 కి.మీ, సగటున 250 కి.మీ. వేగంతో**

**కేంద్ర కేబినెట్ ఆమోదం తర్వాత భూసేకరణ, నిధుల మంజూరు**

3





## ఎరువుల సరఫరా బాధ్యత కేంద్రానిదే

**-మంత్రి పొన్నం ప్రభాకర్**

3

## సీఎంలను అదుపులోకి ఉంచుకోనేందుకే కొత్త బిల్లు

**ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సంచలన ఆరోపణలు**

# కోకాపేట ముందు బంగారం వెలవెల..


**చదరపు గజానికి కనీస ధరను రూ.1.75 లక్షలు**

**రాజధానిలో ఆకాశాన్నంటిన భూముల ధరలు**

**భారీగా పెరిగిన డిపాజిట్ రుసుము**

**కూకట్ పల్లి.. కోట్లుంటేనే వెళ్లాలి**

**బహుళ అంతస్తుల భవనాలతో ఆదాయం**



**జనంపవర్, హైదరాబాద్**

తెలంగాణ రాజధానిలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బంగారం సైతం చిన్నబోయేలా చుక్కలనంటుతున్న ధరలను చూసి సామాన్యుడు నోరెళ్లబెడుతున్నాడు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) పరిధిలో స్థలాలు, భూముల వేలానికి సంబంధించి కనీస ధరలు రికార్డు స్థాయిలో నిర్ణయించడం చర్చనీయాంశమవుతోంది. గతం కంటే కనీస ధరలను 2, 3 రెట్లు పెంచడం గమనార్హం. ఈ మేరకు లేఅవుట్లలో ఖాళీగా ఉన్న ప్లాట్లు,

..మిగతా 3లో

SRK GREEN ENERGY

fssai
SRK Dairy
తెలంగాణలో మంచి నెట్వర్క్ కలిగిన SRK మిల్క్ బ్రాండ్ తో భాగస్వామి అవ్వండి.
ఎస్.ఆర్.కె మిల్క్ డిస్ట్రిబ్యూటర్ / ఫ్రాంచైజీ / ఏజెంట్ కండి
మీ ప్రాంతంలో ఎస్.ఆర్.కె మిల్క్ ఉత్పత్తులను మీరే అమ్మే అవకాశం దక్కించుకోండి.. మంచి లాభాలను పొందండి.




Contact: 96181 81112


# బీసీ రిజర్వేషన్లను అటకెక్కించారా?

మొదటి పేజీ తరువాయి

ఆరోపించారు. ఈ నేపథ్యంలో, బీసీ రిజర్వేషన్ల అమలు, కులగణన, రాజకీయ వ్యూహాలు, ఓటర్ల మనోగతం వంటి అంశాలను ఈ కథనంలో తెలుసుకుందాం

బీసీ రిజర్వేషన్లపై రాజకీయ గందరగోళం తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న హామీ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో కీలక అంశం. అయితే, ఈ హామీ అమలులో ఆలస్యం కావడంతో రాజకీయ విమర్శలు తీవ్రమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఆలస్యానికి బీజేపీని నిందించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం ఆలస్యం చేస్తోందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒత్తిడితో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు.
తాజాగా, రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై నెపం నెట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన చట్టం వల్లే బీసీ రిజర్వేషన్ల అమలు సంక్లిష్టమైందని వాదించారు. బీఆర్ఎస్ హయాంలో రిజర్వేషన్లు 23 శాతానికి తగ్గించడం ద్వారా బీసీలను మోసం చేసిందని కాంగ్రెస్ విమర్శిస్తోంది.

మరోవైపు, బీజేపీ తమ స్పష్టమైన వైఖరిని వెల్లడిస్తూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పూర్తి మద్దతు ఇస్తామని, కానీ ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తామని చెబుతోంది. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు, కాంగ్రెస్ బీసీలను మోసం చేసేందుకు “కపట వ్యూహాలు” అవలంబిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ మాత్రం ఈ విషయంలో నిశ్శబ్దంగా ఉంది, కానీ కాంగ్రెస్ హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శిస్తోంది.




**కాంగ్రెస్ వ్యూహం ఏమిటి?**
కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీల వారీగా కేటాయించాలని భావిస్తున్నట్లు కొన్ని సూచనలు ఉన్నాయి. అంటే, బీసీలకు 42 శాతం సీట్లు రిజర్వ్ చేసి, ఆ సీట్లలో కాంగ్రెస్ బీసీ అభ్యర్థులకు టికెట్లు ఇవ్వాలని ప్లాన్ చేస్తోంది. ఈ వ్యూహం రాజకీయంగా బీసీ ఓటర్లను ఆకర్షించేందుకు ఉపయోగపడవచ్చు. అయితే, ఈ ప్రతిపాదనకు బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పుకుంటాయా అన్నది సందేహాస్పదం. బీజేపీ ఇప్పటికే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 45 శాతం సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చింది. కానీ, వారు మతపరమైన రిజర్వేషన్లను (ముస్లింలకు 10 శాతం) వ్యతిరేకిస్తున్నారు. బీఆర్ఎస్ మాత్రం ఈ అంశంపై స్పష్టమైన వైఖరి వెల్లడించలేదు. కాంగ్రెస్ బీసీ అభ్యర్థులకు టికెట్లు ఇస్తే, బీఆర్ఎస్ లేదా బీజేపీ జనరల్ అభ్యర్థులను నిలబెడితే, రాజకీయ పోటీ తీవ్రమవుతుంది. ఇలాంటి పరిస్థితిలో బీసీ ఓటర్ల మనసు గెలవడం కీలకంగా మారుతుంది. బీఆర్ఎస్ జనరల్ అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా బీసీ ఓట్లను చీల్చే ప్రయత్నం చేయవచ్చు, కానీ ఇది బీసీ సమాజంలో అసంతృప్తిని కలిగించే అవకాశం ఉంది.

**కులగణన ప్రభావం ఎంతమేరకు ఉంటుంది?**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ కులగణన సర్వేను పూర్తి చేసినట్లు ప్రకటించింది. ఈ సర్వే ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. అయితే, ఈ సర్వే పారదర్శకతపై బీజేపీ ప్రశ్నలు లేవనెత్తింది. కొన్ని మండలాల్లో సర్వే జరగలేదని, నిజాలను బయటపెట్టలేదని ఆరోపించింది.

కులగణన బీసీ ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్‌కు ఆయుధంగా మారవచ్చు. బీసీ సమాజంలో కాంగ్రెస్‌పై అనుకూల భావన ఉందని కొందరు నమ్ముతున్నప్పటికీ, బీజేపీ ఆరోపణలు—ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడం ద్వారా బీసీలకు అన్యాయం జరుగుతుందన్న వాదన—కొంతమంది బీసీ ఓటర్ల మనసులో సందేహాలు రేకెత్తించవచ్చు. ఈ సందేహాలు ఓట్ల చీలికకు దారితీసే అవకాశం ఉంది.

**బీజేపీ పరిస్థితి ఏమిటి?**
తెలంగాణలో బీసీలు రాజకీయంగా కీలక శక్తి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 సీట్లతో అధికారంలోకి రావడంలో బీసీ ఓట్లు ముఖ్యమైన పాత్ర పోషించాయి. అయితే, బీసీ రిజర్వేషన్ల అమలులో ఆలస్యం వల్ల కొంత అసంతృప్తి ఉన్నట్లు కనిపిస్తోంది. బీజేపీ ఈ అసంతృప్తిని తమకు అనుకూలంగా మలచుకునేందుకు ప్రయత్నిస్తోంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 45 శాతం సీట్లు కేటాయిస్తామని హామీ ఇవ్వడం ద్వారా బీసీ ఓటర్లను ఆకర్షించేందుకు చూస్తోంది.
అయితే, బీజేపీ ఆరోపణ—ముస్లింలకు రిజర్వేషన్ ఇవ్వడం ద్వారా బీసీలకు అన్యాయం జరుగుతుందన్నది—కొంతమంది బీసీలలో ఆందోళన కలిగించవచ్చు. కాంగ్రెస్ ఈ ఆరోపణలను తిప్పికొట్టడంలో విఫలమైతే, బీసీ ఓట్లు చీలిపోయే అవకాశం ఉంది. మరోవైపు, బీఆర్ఎస్ ఈ అంశంపై నిశ్శబ్దంగా ఉండటం వల్ల బీసీ ఓటర్లలో వారి ప్రభావం తగ్గే ప్రమాదం ఉంది.

**స్థానిక ఎన్నికల్లో ఏం జరగబోతున్నది?**
స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ, బీసీ రిజర్వేషన్లు రాజకీయ వ్యూహాలకు కేంద్ర బిందువైనాయి. కాంగ్రెస్ బీసీ అభ్యర్థులకు టికెట్లు ఇవ్వడం ద్వారా ఓటర్లను ఆకర్షించాలని చూస్తుంది. ఒకవేళ బీఆర్ఎస్ జనరల్ అభ్యర్థులను నిలబెట్టినా, బీసీ ఓటర్లు రిజర్వేషన్ల హామీ ఇచ్చే పార్టీ వైపు మొగ్గే అవకాశం ఉంది. బీజేపీ 45 శాతం సీట్ల హామీతో ఈ పోటీలో ఉండగలదు, కానీ వారి మతపరమైన రిజర్వేషన్ల వ్యతిరేకత వారికి నష్టం కలిగించవచ్చు.

**బీసీల సపోర్ట్ ఎవరికి?**
బీసీ రిజర్వేషన్ల అంశం తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన సమస్యగా మారింది. కాంగ్రెస్ ఈ హామీని అమలు చేయడంలో విజయవంతమైతే, బీసీ ఓటర్ల మద్దతును గెలుచుకునే అవకాశం ఉంది. అయితే, బీజేపీ, బీఆర్ఎస్‌ల ఆరోపణలు, కులగణనపై సందేహాలు ఈ ప్రక్రియను సంక్లిష్టం చేస్తున్నాయి. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు టికెట్ల కేటాయింపు, ఓటర్ల మనోగతం ఈ అంశం భవిష్యత్తును నిర్ణయించనుంది. అన్ని పార్టీలూ బీసీల మద్దతు కోసం పోటీ పడుతున్న నేపథ్యంలో, ఈ రాజకీయ యుద్ధంలో నిజమైన విజేత ఎవరన్నది ఓటర్ల నిర్ణయంపై ఆధారపడి ఉంది.



# హైడ్రా కీలక విజయం

**400 కోట్ల విలువైన ఆస్తులను కాపాడిన హైడ్రా**

జనం పవర్,హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ ప్రాంతంలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో పార్కులతో పాటు రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. 22.20 ఎకరాల్లో సుమారు 100 ప్లాట్లతో అనుమతి పొందిన ఈ లేఔట్‌లో 4 పార్కులుండగా 2 కబ్జా(దాదాపు 8,500 గజాలు)కు గురయ్యాయి. అలాగే 5 వేల గజాల మేర రోడ్డు కూడా కబ్జాకు గురైంది. వీటికి తోడు.. 300ల గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన హోటల్ షెడ్డును కూడా హైడ్రా తొలగించింది. ఇలా మొత్తం 16000 గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. దీని విలువ సుమారు రూ.400 కోట్ల వరకు ఉంటుంది. 1995లో అనుమతి పొందిన ఈ లేఔట్‌ను 2006లో ప్రభుత్వం రెగ్యులరైజ్ కూడా చేసింది.

ఈ లేఔట్ ప్రకారం జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్ చేసిన పార్కులను జైహింద్‌రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారంటూ జూబ్లీ ఎన్‌క్లేవ్ లేఔట్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారించిన హైడ్రా అధికారులు కబ్జాలు వాస్తవమే అని నిర్ధరించుకున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు వాటిని గురువారం తొలగించారు. వెనువెంటనే పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు సూచిస్తూ బోర్డులు కూడా పెట్టారు. పార్కులు, ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కబ్జాకు పాల్పడ్డవారిపై పోలీసు కేసులు పెడుతున్నట్టు హైడ్రా అధికారులు తెలిపారు.

**జైహింద్‌రెడ్డిపై ఫిర్యాదులు**
హైటెక్ సిటీ నుంచి కొండాపూర్ రహదారికి ఆనుకొని మెటల్ చార్మినార్‌కు ఎదురుగా సుమారు 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి.. అనుమతి లేకుండా హోటల్ నిర్మించి అద్దెలను జైహింద్‌రెడ్డి పొందుతున్నాడని జూబ్లీ ఎన్‌క్లేవ్ ప్రతినిధులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే స్థలంలో భారీ ప్రకటనల హోర్డింగ్ కూడా పెట్టి రెండింటి ద్వారా నెలకు రూ.4 లక్షల వరకూ ఆదాయం పొందుతున్నాడని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో హోటల్‌ను నిర్మించి అద్దె వసూలు చేస్తున్న వైనంపై గతంలో జీహెచ్ఎంసీ నోటీసులు కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. 2006లో రెగ్యులరైజ్ అయిన లే ఔట్ అక్కడి ప్లాట్ యజమానులకు తెలియకుండా తర్వాత ఎలా రద్దవుతుందని వాపోయారు. యూఎల్‌సీ ల్యాండ్ అయితే ప్రభుత్వానికి చెందుతుందని.. మధ్యలో జైహింద్‌రెడ్డిది ఎలా అవుతుందని ఎన్‌క్లేవ్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆయనపై చాలావరకు ల్యాండ్ గ్రాబింగ్ కేసులున్నాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. దీంతో హైడ్రా గురువారం ఆక్రమణలను కూల్చివేసింది

# ఆధార్ తరహాలో 'భూధార్'



**- ప్రతి భూమికీ ప్రత్యేక సంఖ్య**
**తెలంగాణ ప్రభుత్వం కసరత్తు**
**భూమికి సంబంధించి పూర్తి సమాచారం ఒకే చోట**
**ఇది అమలులోకి విస్తే నకిలీ పత్రాల సృష్టికి అడ్డుకట్ట**
**పైలట్ గ్రామాల్లో మొదట భూధార్ కార్డులు జారీ**

జనం పవర్,హైదరాబాద్

ఆధార్ తరహాలో భూదార్ తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఆధార్ నంబర్‌తో వయసు, చిరునామా, సిమ్‌కార్డులు, ఆదాయ వివరాలన్నీ తెలుసుకోవచ్చు. అదే విధంగా సర్వే, ఉప సర్వే నంబర్లు, మ్యాప్, సరిహద్దులు, బీమా, నేల రకం, విస్తీర్ణం, ఎలా సంక్రమించింది, లింక్ డాక్యుమెంట్లు, బ్యాంకు రుణాలు, మార్టిగేజ్ తదితర మొదలైన భూమి గురించి సమగ్ర సమాచారాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే 'భూధార్'ను అమలు చేయనుంది. వీలైనంత త్వరగా దీన్ని అమల్లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెవెన్యూ శాఖను ఇటీవల ఆదేశించారు.
ఈ భూధార్ అమలులోకి వస్తే భూ ఆక్రమణలు, నకిలీ పత్రాల సృష్టికి అడ్డుకట్ట పడనుందని ప్రభుత్వం భావిస్తోంది. భూధార్ జారీ చేయాలంటే ప్రతి భూమిని సర్వే చేయాల్సి ఉంటుంది. భూమి సరిహద్దులను అక్షాంశాలు, రేఖాంశాలతో గుర్తించి భూధార్‌లో నమోదు చేస్తారు. దీన్ని రెండు పద్ధతుల్లో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే పూర్తికాక ముందు తాత్కాలిక, పూర్తయ్యాక శాశ్వత భూధార్ అని రెండు భూధార్లు జారీ చేయనుంది.
ప్రతి రిజిస్ట్రేషన్‌మ్యుటేషన్‌కు సర్వే తప్పనిసరి చేస్తూ భూ చట్టంలో సెక్షన్లు చేశారు. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలానికి కనీసం 43 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లను ప్రభుత్వం నియమిస్తోంది. ప్రస్తుతం 7,000 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఇటీవల సర్వే నిర్వహించిన రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన పైలట్ గ్రామాల్లో మొదట భూధార్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.
నంబరు నమోదు చేస్తే..
రాష్ట్రంలో 70.59 లక్షల మంది రైతులు ఉండగా, 1.40 కోట్ల ఎకరాల సాగు భూములున్నాయి. భూ దస్త్రాలు యాజమాన్య హక్కుల చట్టం (ఆర్వోఆర్) కింద ప్రతి కమతానికి పట్టా పాసుబుక్ జారీ చేస్తుండగా, అందులో పలు సర్వే నంబర్ల కింద ఉన్న భూమి వివరాలు తప్ప ఏమీ ఉండటం లేదు.
భూధార్‌తో ఒక రైతుకు చెందిన భూమి సమగ్ర వివరాలు అందుబాటులోకి తీసుకురానున్నాయి. ఇందులో భాగంగా కమతాలన్నింటినీ కంప్యూటరీకరించడం, ప్రభుత్వం వద్ద భూమికి బంధించిన పథకాలన్నింటినీ జోడించే ప్రక్రియలను చేపట్టనున్నారు. అనంతరం ఆర్వోఆర్ 2025 భూభారతి చట్టంలోని సెక్షన్ 9(రూల్ 9) ప్రకారం రాష్ట్రంలోని ప్రతి భూమి ప్లాట్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను జారీ చేయనున్నారు. ఆన్‌లైన్‌లో ఈ నంబర్‌ను నమోదు చేయడం ద్వారా భూమి సమగ్ర వివరాలు తక్షణమే తెలుసుకునే అవకాశాలు ఉంటాయి. దీనికోసం రెవెన్యూశాఖ ఇప్పటికే కార్యాచరణ చేపట్టింది. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ ఆధునికీకరణ పథకంలో భాగంగా ప్రతి కమతానికి యూఎల్‌పిన్/భూ ఆధార్/భూధార్ జారీ చేయాలని కేంద్రం సూచిస్తోంది. పలు రాష్ట్రాలు ఇప్పటికే తాత్కాలిక లేదా శాశ్వత భూధార్ కార్డుల జారీ ప్రారంభించాయి. ప్రతి భూదస్త్రానికి పక్కాగా గుర్తింపు తీసుకురావాలన్నదే ‘భూధార్’ప్రధాన లక్ష్యం. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్న ఆ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుంది. అయితే తాత్కాలిక, శాశ్వత అనే రెండు పద్ధతులను అనుసరిస్తోంది. ప్రతి పౌరుడికీ ‘ఆధార్’ కేటాయించినట్లే దేశంలోని ప్రతి కమతానికీ ఒక విశిష్ఠ నంబర్‌ను కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. ఇదే భూధార్. దీనివల్ల ఆస్తులకు రికార్డు ఉంటుంది.

# కవిత మరో లేఖాస్త్రం..

మొదటి పేజీ తరువాయి

లేఖ రాశారు. ఆ లేఖలో తన సోదరుడు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, తన సోదరుడు కేటీఆర్ లక్ష్యంగా కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీలో తాజాగా ఇటీవల చోటుచేసున్న పరిణామాలపై కె. కవిత తీవ్ర ఆందోళన చెందారు. బీఆర్ఎస్ పార్టీలో తనపై కుట్ర జరుగుతోందని కవిత మరోసారి ఆరోపించారు.
తాను ప్రశ్నించినందునే పార్టీలో తనపై కొందరు కక్ష కట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ హితం కోరి తాను మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశానని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పార్టీలోని నేతలు తన పట్ల కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి కేసీఆర్‌కు తాను రాసిన లేఖ తర్వాత తనను వేధింపులకు గురిచేస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తాను అమెరికా పర్యటనలో ఉండగా.. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా తనను టీబీజీకేఎష్ నుంచి తొలగించారని ఆ లేఖలో ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు.



**విదేశీ పర్యటనలో కవిత..**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు , ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆమె చిన్న కుమారుడు ఆర్యకు అమెరికా యూనివర్సిటీలో సీట్ వచ్చింది. దీంతో అతడిని యూనివర్సిటీలో జాయిన్ చేసేందు ఆర్యతో కలిసి ఆమె అమెరికాకు వెళ్లారు. ఈ పర్యటనకు వెళ్లే ముందు బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను తన కుటుంబంతో కలిసి కవిత కలిశారు. ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో తండ్రి కేసీఆర్ నుంచి కల్వకుంట్ల కవిత కుటుంబం ఆశీర్వాదం తీసుకుంది. ఆ వెంటనే కవిత కుటుంబం హైదరాబాద్‌కు చేరుకుంది. ఆ మరునాడే తన కుమారుడితో కలిసి.. కవిత అమెరికాకు పయనమైయ్యారు. ఆమె విదేశీ పర్యటనలో ఉండగా.. సింగరేణి సంస్థలకు చెందిన పదవిని కొప్పుల ఈశ్వర్‌కు కేటీఆర్ కట్టబెట్టారు. ఈ నేపథ్యంలో సింగరేణి కార్మికులను ఉద్దేశిస్తూ.. కల్వకుంట్ల కవిత అమెరికా నుంచి లేఖ రాశారు. దీంతో బీఆర్ఎస్ పార్టీలో అన్నచెల్లమ్మల మధ్య పోరు తార స్థాయికి చేరిందనే వార్తలు వెలువడుతున్నాయి.

# ఎంపీ మల్లు రవి గారు.. మా నడిగడ్డను పట్టించుకోరా..?

**జోగులాంబ గద్వాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు తపాలా రామాంజనేయులు**

జనం పవర్,హైదరాబాద్

ఒక ఎంపీగా ఈ సంవత్సర కాలం లో మా నాగరకర్నూల్ పార్లమెంట్ కు ఎన్ని నిధులొచ్చాయ్, మా పార్లమెంట్ పరిధిలో రావాల్సిన నవోదయ, సైనిక్ స్కూల్స్ పై దృష్టి పెట్టారా లేదా అనేది ప్రజలకు సమాధానం చెప్పాలని జోగులాంబ గద్వాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు తపాలా రామాంజనేయులు డిమాండ్ చేశారు.
మీ పార్టీ ద్వారా మికిచ్చిన క్రమశిక్షణ కమిటీ పదవికి న్యాయం చేస్తూ.. మీకు ప్రజలిచ్చిన ఎంపీ పదవికి క్రమశిక్షణతో పని చేయాలని ఆలోచన లేదా అని ప్రశ్నించారు. నాగరకర్నూల్ పార్లమెంట్ పరిధిలో పక్కన ఉన్న పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ రోజు ఏదో ఒక అభివృద్ధి చేయాలనే ఆలోచనతో తనకున్న పరిధి 7 నియోజకవర్గాల ప్రజలతో సత్సంబంధాలతో ఉంటూ అక్కడ అభివృద్ధి కి పునాదులు వేస్తూ కేంద్రం నుంచి వచ్చే నిధులను తీసుకొని వస్తుండడం కనిపించడం లేదా అంటూ మల్లు రవిని సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికైనా మీరు పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను కేంద్ర పరిధి నుంచి ఏ ఏ అభివృద్ధి పనులకు నిధులు తేవాల్నో ఆ నిధులపై దృష్టి పెట్టి అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని మిమ్మల్ని కోరుతున్నామని తెలిపారు. గద్వాల నియోజకవర్గ ప్రజల తరపున మా ప్రాంత అభివృద్ధిని ప్రశ్నిస్తూ.. ఈ ప్రాంత అభివృద్ధిలో విద్య, వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక, రోడ్డు రవాణా రంగాలకు తోడ్పాటు అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిధులను తీసుకొని రావాలని కోరుతున్నామన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం మీ మీద ఒత్తిడి తెస్తామని జిల్లా బీజేపీ పార్టీ ద్వారా తెలుపుతున్నామన్నార.





# అందుకే కేబుల్స్ కట్

**విద్యుత్ షాక్ ఘటనల నేపథ్యంలోనే.**

**కరెంట్ వైర్లకు దగ్గరగా పెట్టడంతో ప్రమాదాలు**

**గతంలో చాలా సార్లు చెప్పిన మారడం లేదు**

**అందువల్లే కేబుల్స్ కట్ చేయాల్సి వస్తుంది**

**వర్ష కాలంలో సాధ్యమైనంత వరకు జాగ్రత్తగా ఉండాలి**

**అత్యవసర సేవలకు అంతరాయం లేకుండా కేబుల్స్ కట్**

**విద్యుత్ షాక్‌తో ఏడుగురు చనిపోవడం బాధాకరం**

**హైదరాబాద్‌లో సీఎండీ ముషారఫ్ అలీ**

**జనం పవర్, హైదరాబాద్**

సెంట్రల్ హైదరాబాద్ పరిధిలోనే విద్యుత్ షాక్ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ షాక్‌తో ఏడుగురు చనిపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో సీఎండీ ముషారఫ్ అలీ మాట్లాడుతూ.. టీవీ కేబుల్స్, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ రెగ్యులర్‌గా కరెంట్ వైర్లకు దగ్గరగా పెట్టడంతో వర్షా కాలంలో ఇబ్బందులు తలెత్తే.. ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ అంశంపై గ్రేటర్ పరిధిలోని కేబుల్ ఆపరేటర్స్‌తో చాల సార్లు సమావేశం ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయినా వాళ్ళు మారడం లేదన్నారు.

అందువల్లే కేబుల్స్ కట్ చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. టీజీఎస్పీడీసీఎల్ సూచించిన ప్రమాణాల ప్రకారం కేబుల్ వైర్లు, సర్వీస్ ప్రొవైడర్లను వాడడం లేదన్నారు. ప్రస్తుతం వర్ష కాలంలో సాధ్యమైనంత వరకు జాగ్రత్తగా ఉండాలంటూ నగర వాసులకు ఆయన కీలక సూచన చేశారు. కేబుల్స్ కట్ చేయడం వల్ల ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయం చూడాలని ఇప్పటికే కేబుల్స్ ఆపరేటర్స్‌కు సూచించామన్నారు. అయితే కేబుల్స్ కట్ చేయడంపై తెలంగాణ హైకోర్టు కొన్ని కీలక సూచనలు చేసింది.. ఆ క్రమంలో కోర్టు వివరణ ఇచ్చిన తర్వాత.. తదుపరి యాక్షన్ ఉంటుందని సీఎండీ ముషారఫ్ అలీ వెల్లడించారు.

కృష్ణాష్టమి సందర్భంగా హైదరాబాద్‌లోని రామాంతాపూర్‌లో భక్తులు యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో కరెంట్ షాక్ తగిలి ఆరుగురు యువకులు మరణించారు. అలాగే మరో ప్రాంతాల్లో కరెంట్ షాక్ తగిలి మరో ఇద్దరు మరణించారు. అలాగే వినాయకుడి విగ్రహం తీసుకు వెళ్తూ మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో విద్యుత్ స్తంభాలకు ఉన్న ఇంటర్నెట్ కేబుళ్లను తొలగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించింది. దీంతో నగరంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించారు. దీంతో ప్రభుత్వ చర్యలను కేబుల్ ఆపరేటర్లు ఖండించారు. ఆ క్రమంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీతో కేబుల్ ఆపరేటర్లు బుధవారం సమావేశమయ్యారు. వీరి మధ్య జరిగిన చర్చలు సఫలమైనట్లు వార్త కథనాలు వెల్లడించిన విషయం విదితమే

# గేమ్ కోసం చదువు వదిలాడు.. చివరికి ప్రాణాలను కోల్పోయాడు



**నిర్మల్ జిల్లాలో విషాదం**

**విద్యార్థి నిండు ప్రాణాన్ని తీసిన పబ్జీ**

**జనం పవర్, హైదరాబాద్**

నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఓ విద్యార్థి పబ్జీ గేమ్‌కు బానిసై ఆత్మహత్యకు పాల్పడిన దుర్ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకెళితే హైదరాబాద్ మౌళాలి ప్రాంతానికి చెందిన బేతి సంతోష్, సాయిప్రజ దంపతులు వ్యాపారం నిమిత్తం కొంతకాలంగా భైంసా ఆనందనగర్ కాలనీలో నివాసముంటున్నారు. వీరికి ఒక కుమారుడు రిశేంద్ర, ఒక కుమార్తె ఉన్నారు. రిశేంద్ర హైదరాబాద్‌లోని భాష్యం స్కూల్లో 9వ తరగతి పూర్తి చేసి, పదో తరగతిలో చేరేందుకు సిద్ధమయ్యాడు.
అయితే గత కొంతకాలంగా రిశేంద్ర మొబైల్‌లో పబ్జీ గేమ్ ఆడటానికి బానిసై పోయాడు. చదువు పై ఆసక్తి చూపకుండా రోజంతా ఫోన్‌లో గేమ్ ఆడుతుండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కొత్త విద్యాసంవత్సరంలో పాఠశాలకు వెళ్లాల్సిన బాలుడు భైంసాలోనే ఉండిపోవడంతో కుటుంబ సభ్యులు మరింత నిరాశకు గురయ్యారు. తనలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు గత రెండు మూడు రోజులుగా అతడిని పబ్జీ ఆడనీయకుండా కట్టడి చేశారు. ఈ విషయాన్ని రిశేంద్ర భరించలేకపోయాడు. ఈ క్రమంలోనే తీవ్ర నిరాశకు గురై, మానసిక ఒత్తిడితో, నిరుత్సాహంతో బుధవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు.
తల్లిదండ్రులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. భైంసా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఒకప్పుడు పాఠశాలలో ప్రతిభావంతుడిగా గుర్తింపు పొందిన రిశేంద్ర ఇలా గేమ్ వ్యసనానికి బలైపోవడం చూసి అందరూ షాక్‌కు గురవుతున్నారు. స్థానికులు మాట్లాడుతూ చిన్నారుల పై మొబైల్ గేమ్స్ ప్రభావం ఎంత ప్రమాదకరమో ఇది మరోసారి నిరూపితమైంది. తల్లిదండ్రులు పిల్లల పై మరింత శ్రద్ధ వహించాలని, గేమ్స్‌కు దూరంగా ఉంచాలని సూచించారు.

# కోకాపేట ముందు బంగారం వెలవెల..

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వానికి చెందిన స్థలాలను ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు బుధవారం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నోటిఫికేషన్ జారీ చేసింది.



**ఆదాయార్జన కోసమే**

హైదరాబాద్ శివారులోని కీలకమైన ప్రాంతంగా పేరున్న కోకాపేటలో చదరపు గజానికి కనీస ధరను రూ.1.75 లక్షలుగా హెచ్ఎండీఏ నిర్ణయించింది. గతంలో ఇది రూ.65,000 ఉండేది. అప్పట్లో రియల్ ఎస్టేట్ కంపెనీ కోకాపేటలో ఎకరా భూమి రూ.100 కోట్లకు దక్కించుకోవడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ ఏరియాలో సర్వే నెంబర్ 144లో ప్రభుత్వానికి 8,591 చదరపు గజాల భూమి ఉంది. ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధరను పరిగణనలోకి తీసుకున్నట్లయితే విలువ సుమారు రూ.150 కోట్లు దాటుతుండగా, ఆన్‌లైన్ వేలంలో ఈ ధర ఎంతకు పోతుందోననే ఆసక్తి నెలకొంది.

**భారీగా పెరిగిన డిపాజిట్ రుసుము**

గత అనుభవాల దృష్ట్యా హెచ్ఎండీఏ సరికొత్త నిబంధనలతో వేలం నిర్వహించాలని నిర్ణయించింది. మోకిలలో ప్లాట్లను వేలం వేయగా, చాలా మంది రూ.1,00,000 ధరావతు చెల్లించి వేలం ప్రక్రియలో పాల్గొన్నారు. వంద మందికి పైగా వేలందారులు చదరపు గజం ధరను రూ.లక్ష వరకు పెంచేసి, తర్వాత డబ్బులు చెల్లించడం మానేశారు. వేలం వేసిన భూమికి దగ్గరలో ఉన్న తమ స్థలాల ధరలను పెంచుకునేందుకు అలా ఎక్కువ ధరకు పాడినట్లుగా అధికారులు గుర్తించారు. గత అనుభవాల నేపథ్యంలో హెచ్ఎండీఏ ఈసారి అప్రమత్తమైంది. తాజాగా డిపాజిట్ రుసుముల మొత్తాలను భారీగా పెంచింది. ఉదాహరణకు కోకాపేటలోని 8,591 చదరపు గజాల స్థలాన్ని వేలంలో దక్కించుకోవాలంటే రూ.ఐదు కోట్లను డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

**కూకట్ పల్లి.. కోట్లుంటేనే వెళ్లాలి**

హైదరాబాద్ నగరంలోని కేపీహెచ్‌బీ (కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు) కాలనీలో ఎకరా ధర రికార్డు స్థాయిలో ఏకంగా రూ.70 కోట్లు పలికింది. హైటెక్ సిటీకి సమీపంలో ప్రముఖ సంస్థలకు చెందిన బహుళ అంతస్తుల బిల్డింగ్‌లు ఉన్న ఈ ప్రాంతంలో స్థలాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. 100 గజాల స్థలం దొరకడం కూడా గగనమే. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ 4వ ఫేజ్‌లో ఉన్న 7 ఎకరాల 33 గుంటల స్థలానికి బుధవారం హౌసింగ్ బోర్డు ఈవేలాన్ని నిర్వహించగా రికార్డు స్థాయిలో రూ.547 కోట్ల భారీ ధర పలికింది. గోద్రెజ్ ప్రాపర్టీస్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్, అరబిందో రియాల్టీ, అశోక బిల్డర్ లాంటి సంస్థలు ఈవేలంలో పాల్గొన్నాయి. ఎకరాకు హౌసింగ్ బోర్డు కనీస ధరను రూ.40 కోట్లుగా నిర్ణయించింది. బిడ్‌లో పాల్గొన్నటువంటి సంస్థలు 46 సార్లు ధరను పెంచుతూ పోటీ పడ్డాయి. చివరకు గోద్రెజ్ ప్రాపర్టీస్ ఈ స్థలాన్ని ఎకరా రూ.70 కోట్లు చొప్పున ధరకు సొంతం చేసుకుంది. ఈ మేరకు దీంతో వచ్చిన వచ్చిన ఆదాయాన్ని పేద, మధ్యతరగతి ప్రజల కోసం నిర్మించే గృహనిర్మాణ పథకాలకు వినియోగించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**బహుళ అంతస్తుల భవనాలతో ఆదాయం**

రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు చెందిన టౌన్‌షిప్‌లలో అసంపూర్తిగా ఉన్న మల్టీస్టోరెడ్ బిల్డింగ్స్ (బహుళ అంతస్తుల భవనాల) విక్రయం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మరో రూ.70.11 కోట్ల ఆదాయం సమకూరింది. హైదరాబాద్ నగర శివారులోని పోచారం టౌన్‌షిప్‌లో 194 ఫ్లాట్లున్న 2 టవర్లను, గాజుల రామారంలో 112 ఫ్లాట్లున్న ఒక టవర్‌ను బుధవారం లాటరీ పద్ధతి ద్వారా కేటాయించారు. చదరపు అడుగుకు పోచారంలో రూ.1,650, గాజులరామారం ప్రాంతంలో రూ.1,995 ధరను నిర్ణయించారు. పోచారంలో 72 ఫ్లాట్ల టవర్‌ను ఎన్‌టీపీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు రూ.13.78 కోట్లకు, 122 ఫ్లాట్లున్న మరో టవర్‌ను గాయత్రి ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ ట్రస్టుకు రూ.30 కోట్లకు కేటాయించారు. గాజుల రామారంలో టవర్‌ను ఎఫ్‌సీఐ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు రూ.26.33 కోట్లకు కేటాయించారు. తద్వారా హెచ్ఎండీఏ భారీగా ఆదాయాన్ని రాబట్టాలని భావిస్తోంది.



# ఎరువుల సరఫరా బాధ్యత కేంద్రానిదే

**-మంత్రి పొన్నం ప్రభాకర్**

**జనం పవర్, హైదరాబాద్**

తెలంగాణ రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా పట్టించుకోవడం లేదు. కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రాతినిథ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారు. రైతులకు జవాబు చెప్పాల్సిన బాధ్యత బండి సంజయ్‌పై ఉంది. ఎరువుల విషయంలో రైతుల్లో భయాందోళనలు సృష్టించి భారత రాష్ట్ర సమతి నేతలు రాక్షసానందం పొందుతున్నారు. రైతులకు అవసరమైన ఎరువుల్లో 60 శాతం మాత్రమే కేంద్రం నుంచి వచ్చింది. అందువల్లే కొంత ఇబ్బంది కలుగుతోంది. రాష్ట్రం నుంచి ఏదైనా సమస్య వస్తే బాధ్యత వహించడానికి మేం సిద్ధంగా ఉన్నాం'' అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

# త్వరలో రయ్ రయ్!

**తెలుగు రాష్ట్రాలకు బుల్లెట్ రైళ్లు..**

**హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా చెన్నై, బెంగుళూరులకు**

**గంటకు గరిష్ఠంగా 350 కి.మీ., సగటున 250 కి.మీ. వేగంతో**

**కేంద్ర కేబినెట్ ఆమోదం తర్వాత భూసేకరణ, నిధుల మంజూరు**

**జనం పవర్, హైదరాబాద్**



తెలుగు రాష్ట్రాల్లో బుల్లెట్ రైళ్లు పరుగులు తీయనున్నాయి. హైదరాబాద్ నుంచి బుల్లెట్ రైలు సదుపాయం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. పొరుగు రాష్ట్రాల్లోని మెట్రో నగరాలను కలుపుతూ ఈ రైళ్లు పరుగులు తీసేలా కార్యాచరణ రూపొందుతోంది. ఇప్పటికే హైదరాబాద్ ముంబై హైస్పీడ్ మార్గం డీపీఆర్ సిద్ధమై రైల్వే బోర్డుకు చేరింది. అదే తరహాలో హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా చెన్నై, బెంగుళూరులకు వేర్వేరుగా రెండు హైస్పీడ్ రైలు కారిడార్లను ఖరారు చేసేందుకు కసరత్తు కొనసాగుతోంది. గంటకు గరిష్ఠంగా 350 కి.మీ, సగటున 250 కి.మీ. వేగంతో ప్రయాణించేలా ఈ మార్గాల్ని డిజైన్ చేస్తున్నారు.

**తెలంగాణలో రెండే స్టేషన్లు..**

హైదరాబాద్ ముంబై హైస్పీడ్ కారిడార్ డీపీఆర్‌లో మొత్తం 11 స్టేషన్లను ప్రతిపాదించగా, రాష్ట్రంలో సుమారు 170 కి.మీ. పరిధిలో ఉంటుంది. తెలంగాణలో హైదరాబాద్, జహీరాబాద్ రెండు స్టేషన్లు మాత్రమే ఉన్నాయి. కేంద్ర కేబినెట్ ఆమోదం తర్వాత భూసేకరణ, నిధుల మంజూరు వంటి ప్రక్రియలు మొదలు కానున్నాయి. హైదరాబాద్ ముంబై కారిడార్‌తో పాటు చెన్నై, బెంగళూరు మార్గాలను కలిపితే రాష్ట్రంలో హైస్పీడ్ కారిడార్ దూరం 580 కి.మీ.గా ఉండనుంది.
హైదరాబాద్ వయా చెన్నై, బెంగళూరు హైస్పీడ్ కారిడార్ తుది సర్వే పనులు చేపట్టిన రైల్వే అనుబంధ రైట్స్ సంస్థ ప్రాథమికంగా ఎలైన్‌మెంట్లు రూపొందించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను సేకరించిన తర్వాత వాటిని ఖరారు చేస్తారు. ఈ మేరకు సర్వే సంస్థ అధికారులు కొద్ది రోజుల క్రితం తెలంగాణ ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు. ఆయా ప్రతిపాదనలపై చర్చించారు.

**పాతవాటితో సంబంధం లేకుండా పూర్తి కొత్తగా..**

హైదరాబాద్ నుంచి చెన్నైకి కాజీపేట, నల్గొండ మీదుగా ఇప్పటికే రెండు రైల్వే మార్గాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలను కలుపుతూ జాతీయ రహదారి 65 కూడా ఉంది. ప్రాథమికంగా ఈ మూడు మార్గాలపై చర్చించగా.. కాజీపేట మీదుగా అయితే దూరం పెరుగుతుందని భావిస్తున్నట్లు సమాచారం. అందుకే కొత్త లైన్ జాతీయ రహదారికి సమాంతరంగా గానీ, నల్గొండ మీదుగా వేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు.
ప్రస్తుతం ఉన్న రైలు మార్గంలో హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరులకు ప్రయాణ సమయం దాదాపు 1213 గంటలుగా ఉంది. ఈ ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించాలని కేంద్రం భావిస్తోంది. ఆయా నగరాలను మూడు గంటల్లోనే చేరుకునేలా బుల్లెట్ రైలు ప్రాజెక్టులను డిజైన్ చేస్తున్నారు. అందుకే వీటిని గ్రీన్‌ఫీల్డ్ నమూనాలో సరికొత్తగా నిర్మించాలని భావిస్తున్నారు. మెట్రో తరహాలో ఈ మార్గంలో కేవలం బుల్లెట్ రైళ్లే నడుస్తాయి. వేరే రైలు మార్గాల్లో ఈ రైళ్లు నడవవు, ఈ మార్గాల్లో ఇతర రైళ్లకు అవకాశం ఉండదు.

# సీఎంలను అదుపులోకి ఉంచుకొనేందుకే కొత్త బిల్లు

**చంద్రబాబు, నితీశ్ కుమార్‌ను బెదిరించేందుకు ప్లాన్**

**ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సంచలన ఆరోపణలు**

**జనం పవర్, హైదరాబాద్**



కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఒక కొత్త బిల్లు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఇది ఎన్డీయే కూటమిలోని కీలక మిత్రపక్షాలైన టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జేడీయూ అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌లను బెదిరించి, తమ అదుపులో ఉంచుకోవడానికేనని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. తీవ్రమైన నేరారోపణల కింద అరెస్టయిన ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు లేదా మంత్రులు 30 రోజుల్లోగా తమ పదవులకు రాజీనామా చేయాలని, లేదంటే వారిని తొలగించేలా ఈ బిల్లును రూపొందించారు. బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని తేజస్వి యాదవ్ ఆరోపించారు. ప్రస్తుతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం టీడీపీ, జేడీయూ మద్దతుతోనే కొనసాగుతోందని, భవిష్యత్తులో వారిని రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేసేందుకే ఈ బిల్లును ఒక ఆయుధంగా వాడుకోవాలని చూస్తోందని ఆయన విమర్శించారు. దేశాభివృద్ధిని పక్కనపెట్టి, విధ్వంసకర వ్యూహాలు రచిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌లను జైలుకు పంపారని గుర్తుచేశారు. ఇప్పుడు ఈ కొత్త చట్టం ద్వారా చంద్రబాబు, నితీశ్ వంటి నేతలను కూడా బెదిరించాలని చూస్తున్నారని అన్నారు. అవసరమైతే వారిపై కొత్త కేసులు బనాయించి, తమ చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి కేంద్రం ఎంతకైనా తెగిస్తుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మరోవైపు, ఈ బిల్లు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచేందుకు, తమకు నచ్చని నేతలను లక్ష్యంగా చేసుకునేందుకేనని ప్రతిపక్షాలు దుయ్యబడుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని కాంగ్రెస్ పార్టీ వంటి ఇతర విపక్షాలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

# నూతన పార్కు పనులను ప్రారంభించిన సింగరేణి డైరెక్టర్

**జనం పవర్, రామగుండం, ఆగస్ట్ 21,**

సింగరేణి అర్జీ1 పరిధిలోని దుర్గ మాత దేవాలయం పాత 18 మె.వా పవర్ హౌస్ వద్ద సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణ నూతన పార్క్ పనులను గురువారం ప్రారంభించారు. అనంతరం అన్నప్రసాద వితరణ షెడ్డు శంఖు స్తాపన చేశారు. ఈ కార్యక్రమము ఆర్జీ. 1 జిఎం డి. లలిత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించడము జరిగినది. ఇందులో సింగరేణి సంస్థ డైరెక్టర్ డి. సత్యానారాయణ రావు, ఆయన సతీమణి హరిణి సత్యానారాయణ రావు ముఖ్య అతితులుగా హాజరయి వివిధ కార్యక్రమములో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చిన డైరెక్టర్ దంపతులకు మొదట ఆలయ ఆవరణలో అమ్మవారి సన్నిధిలో వేద పండితులు పూర్ణ కుంబ స్వాగతం పలికి అమ్మవారికి అర్చన అభిషేకం ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాజీవ్ రహదారి ప్రక్కన నూతనముగా చేపట్టిన పార్కులో మొక్కలు నాటడం జరిగినది. మరియు



భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ షెడ్డు శంఖుస్తాపన పూజ కార్యక్రమము నిర్వహించడం జరిగినది. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు ఆన్నధానం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా వచ్చిన డైరెక్టర్ డి.సత్యానారాయణ రావు మరియు వారి సతీమణి హరిణి దంపతులకు ఆలయ కమిటి సభ్యులు ఘనంగా పులబోకెలు అందజేసి శాలువాలతో సన్మానం చేసారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ నూతనముగా తీర్చిదిద్దిన పార్కును సుమారు 5 లక్షల అంచన వ్యయంతో వివిధ రకాల ఫల, పుష్పాది మొక్కలతో చూపరులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉట్టి పడేలా ఇచ్చటి దుర్గ మాత అమ్మవారి దర్శనానికి వచ్చు భక్తులు మరియు రాజీవ్ రహదారి ప్రక్క రోడ్డు నుండి వెళ్ళు వాహన దారులకు పాదచారులకు ఈ పార్క్ ఎంతో సేదా తీరుటకు ఉపయోగాములో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఎం.ఓ.ఐ నాయకులు మల్లేష్, యస్.ఓ.టు జిఎం ఆంజనేయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డిజియం ఫైనాన్స్ ధనలక్ష్మి భాయి, ఏజెంట్స్ చిలక శ్రీనివాస్, యల్. రమేష్, ఏరియా ఇంజనీర్ రమేష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హన్మంతరావు, అధికారులు బీమా జితేందర్ సింగ్, కర్ణ, వరప్రసాద్, నాగేశ్వరరావు, లక్ష్మిరాజు, వీరా రెడ్డి, సాంబశివరావు మరియు ఆలయ కమిటి సభ్యులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలలు,అంగన్వాడీలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 21:**

భూ సమస్యల పరిష్కారానికి అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం ఆయన కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కూనారం, ఇదులాపూర్ గ్రామాలను సందర్శించి మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించిన పట్టా దరఖాస్తులను ప్రత్యక్షంగా పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జాఫర్ ఖాన్ పేట, ఇదులాపూర్ గ్రామాల లోని అంగన్వాడీ కేంద్రాలు, అప్పర్ ప్రైమరీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశుభ్రత, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల గ్రహణశక్తి పెంపుదలపై దృష్టి పెట్టాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు, అందించే ఆహారం, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ జగదీశ్వర్ రావు, డీటీ శంకర్, సర్వేయర్ రాజు తదితర అధికారులు కలెక్టర్‌తో పాటు ఉన్నారు.

## ధర్మారం పోలీస్ స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ!

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 21:**



రామగుండం పోలీసులు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వార్షిక తనిఖీల్లో భాగంగా ధర్మారం పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా స్టేషన్‌లోని సిబ్బంది పనితీరు,పూర్వకేసులు,దర్యాప్తులో ఉన్న కేసులు,రిసెప్షన్ సేవలు, స్టేషన్ రికార్డులు పరిశీలిస్తూ,సమస్యలు,లోపాలను గుర్తించారు. స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ పరిస్థితులు ,గ్రామాల్లో జరిగే నేరాలు,రౌడీ షీటర్ల సమాచారం,అనుమానితుల కదలికలపై సీపీ క్షుణ్ణంగా తెలుసుకున్నారు.సిబ్బందికి 24×7 ప్రజలకు అందుబాటులో ఉండి,ఫిర్యాదుదారులకు తక్షణమే న్యాయం కల్పించాలి,రోడ్డు ప్రమాదాలు,ప్రమాదభరిత ప్రదేశాలపై సమన్వయ చర్యలు చేపట్టి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.భవిష్యత్తులో కూడా సిస్టమ్ సక్రమంగా పనిచేయాలన్న ధ్యేయంతో,ప్రజలతో సానుకూల సంబంధాలను నిలుపుకోవాలని,న్యాయం ఎల్లప్పుడూ బాధితుల వైపున ఉండాలని ఆదేశించారు. తనిఖీ సందర్భంగా సీపీ,డీసీపీ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్,ఏసీపీ జి.కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఆర్డీఓ స్థాయిలోనే పలు భూ సమస్యలు పరిష్కారం : కలెక్టర్

**జనం పవర్, పెద్దపల్లి ఆగస్టు 21:**



భూ సమస్యల పరిష్కారానికి ప్రతి దరఖాస్తుదారుడు కలెక్టరేట్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. భూ భారతి పోర్టల్‌లోని కొన్ని మాడ్యూల్స్ కింద సమస్యలు ఆర్డిఓ స్థాయిలోనే పరిష్కారం అవుతున్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా మార్కెట్ విలువ రూ.5 లక్షలలోపు ఉన్న మిస్సింగ్ సర్వే నంబర్లు, భూ విస్తీర్ణ సవరణ, పట్టా పాస్‌బుక్‌లో డిజిటల్ సంతకం, పేరు సవరణ, పెండింగ్ మ్యూటేషన్, పెండింగ్ సక్సెషన్, నాలా సంబంధిత అంశాలు, కోర్టు కేసుల పిపిబి, అలాగే నాలా నుండి వ్యవసాయ భూమిగా మార్చుకునే సమస్యలు ఆర్డిఓ కార్యాలయంలోనే పరిష్కారమవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంలో ప్రజలు అనవసరంగా కలెక్టరేట్‌కు వచ్చి ఇబ్బందులు పడకుండా నేరుగా ఆర్డిఓ కార్యాలయాలను సంప్రదించాలని ఆయన సూచించారు.

## గణేష్ నవరాత్రులకు ముందస్తు ఏర్పాట్లపై పోలీసుల దృష్టి




**జనం పవర్,గోదావరిఖని ఆగస్టు 21:**

గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం సీఐ ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం జరిగింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో హిందూ, ముస్లిం మత పెద్దలు, వివిధ వినాయక మండప నిర్వాహకులు పాల్గొని తమ అభ్యర్థనలు, సందేహాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక విగ్రహాల ప్రతిష్టాపనకు ముందు ప్రతి ఒక్కరు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద నాణ్యమైన ఎలక్ట్రికల్ వైర్లు వాడటం, అగ్ని ప్రమాద నిరోధక చర్యలు తీసుకోవడం, సరైన పార్కింగ్ సదుపాయాలు కల్పించడం, రోడ్లపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగే విధంగా మండపాలను ఏర్పాటు చేయకుండా చూడాలని ఆదేశించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో బయటికి వెళ్లే మార్గాలను స్పష్టంగా ఉంచాలి, అధిక శబ్దం చేసే డిజేలు, సౌండ్ సిస్టమ్‌స్‌ను నిషేధించాలి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాలంటీర్లను నియమించి వారిని పోలీసులతో సమన్వయం చేయాలని తెలిపారు. వినాయక నిమజ్జనం క్రమబద్ధంగా జరిగేలా మార్గదర్శకాలు పాటించాల్సిందిగా సూచించారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రులు జరుపుకోవాలని, అన్ని మతాలు సోదరభావంతో పండగలను ఉత్సాహంగా నిర్వహించుకోవాలని, అందరూ పోలీసు శాఖకు సహకరించాలని సీఐ ఇంద్రసేనా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, మత పెద్దలు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## ఈశ్వరకృప వృద్ధాశ్రమంలో వృద్ధుల దినోత్సవ వేడుకలు

**జనం పవర్,రామగుండం ఆగస్టు 21:**

ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి హైకోర్టు అడ్వకేట్ ఈశ్వర కృప వృద్ధాశ్రమంను సందర్శించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హానరబుల్ సెక్రటరీ స్వప్న రాణి తన భర్త పి.ఎన్. సునీల్ కుమార్ రెడ్డి జన్మదినోత్సవాన్ని, అలాగే ఉజ్వల్ కార్తికేయ జన్మదినోత్సవాన్ని వృద్ధులతో కలిసి ఆశ్రమంలో జరుపుకున్నారు. కుటుంబ సభ్యులైన సత్యనారాయణ, సరస్వతి గార్ల సమక్షంలో వృద్ధులకు ఆహ్లాదకర వాతావరణంలో వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వప్న రాణి వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి పి.టి. స్వామి అధ్యక్షత వహించగా, ఆశ్రమ డైరెక్టర్లు గంట సత్తయ్య, గీతా దేవి, ఎల్. మాధవరెడ్డి, బట్టల వెంకటయ్య, ఏ. రామచంద్రరావు, సలహాదారు ఏ. సీతారామ రెడ్డి, సామాజిక కార్యకర్త చల్లా రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం-3లో సింగరేణి కార్మికుల సమస్యలపై జి.ఎం. సమీక్ష

**జనం పవర్, రామగిరి ఆగస్టు 21:**



రామగుండం3 అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గురువారం జి.ఎం. కార్యాలయంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావుతో పాటు గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి యం.రామచంద్రారెడ్డి, ఇతర సభ్యులు పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా అడ్రియాల లాంగ్ వాల్ గని సబ్‌స్టేషన్ నుండి పోచమ్మ ఆలయం వరకు రహదారి నిర్మాణం, త్రీ సీమ్ పంచ్ ఎంట్రీ వద్ద త్రాగునీటి సౌకర్యం, మొక్కల నాటకం, ఓసిపి 1 సి.హెచ్.పి క్యాంటీన్ భవన మరమ్మతులు, మహిళా ఉద్యోగుల కోసం విశ్రాంతి గది, సెంటినరీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సీలింగ్, ఏసీ మరమ్మతులు, డైనింగ్ హాల్ సీలింగ్, చెట్ల పొదలను తొలగించి పూల మొక్కలు నాటడం, రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం వద్ద నీటి నిల్వ సమస్య పరిష్కారం, యోగా కేంద్రం వద్ద పొదల తొలగింపు, ఓపెన్ జిమ్ పరికరాల ఏర్పాటు, సెంటినరీ కాలనీ డిస్పెన్సరీలో మహిళలకు మరుగుదొడ్లు, ఫిజియోథెరపీ పరికరాల అమరిక, డిస్పెన్సరీ పైకప్పు రేకులు, కోల్ కారిడార్ రహదారి విస్తరణ, సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం, గృహనిర్మాణ రుణ రీయింబర్స్‌మెంట్, ఖాళీ స్థలంలో పార్కు ఏర్పాటు వంటి అంశాలు చర్చకు వచ్చాయి. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కార్పొరేట్ కార్యాలయ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని జి.ఎం. హామీ ఇచ్చారు. సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు, ఏరియా ఇంజనీర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్లు, విభాగాధిపతులు మరియు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## న్యాయస్థానంలో రుజువైన గంజాయి వ్యాపారం..

**నిందితులకు జైలు శిక్ష,జరిమానా**

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 21:**



పెద్దపల్లి జిల్లా రూరల్ పోలీసులు గంజాయి అక్రమ రవాణా,విక్రయాలకు చెక్ పెట్టారు. బొంపల్లి గ్రామంలో గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. నిందితులు సయ్యద్ సలీం (పెద్దపల్లి) మరియు అమరదీప్ కుమార్ (బీహార్) నిజామాబాద్ నుంచి 2 కిలోల గంజాయిని రూ.10,000కు కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.150 నుండి రూ.200కు విక్రయిస్తుండగా పట్టుబడ్డారు.ఈ మేరకు బసంత్‌నగర్ ఎస్సై జానీ పాషా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, పెద్దపల్లి సీఐ ఎ.ప్రదీప్ కుమార్ కేసు విచారణ చేపట్టారు. అనంతరం నిందితులను న్యాయస్థాన రిమాండ్‌కు పంపించారు. పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, జిల్లా న్యాయమూర్తి కె.సునీత ఇరువురి వాదనలను సమీక్షించి నిందితులపై నేరం రుజువైనట్లు తేల్చారు. దీనితో సయ్యద్ సలీం, అమరదీప్ కుమార్‌లకు చెరో మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు చెరో రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ కేసు విజయవంతంగా రుజువు కావడంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదం రమేష్ కీలక పాత్ర పోషించారు. విచారణ ప్రక్రియలో పెద్దపల్లి డీసీపీ పి.కరుణాకర్, ఏసీపీ జి.కృష్ణ పర్యవేక్షణలో సీఐ కె.ప్రవీణ్ కుమార్, ఎస్సై మల్లేష్, కోర్ట్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వెంకటేశ్వర్లు, హెచ్‌సీలు (2330, 2465) సమన్వయంతో పనిచేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఈ కేసులో కృషి చేసి, నిందితులకు శిక్షలు ఖరారు కావడానికి శ్రమించిన ప్రాసిక్యూషన్ బృందాన్ని అభినందించారు.

### గంజాయి వినియోగం యువతను నాశనం చేస్తుంది: డీసీపీ పి. కరుణాకర్

యువతను మత్తు బారిన పడేసి జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్న గంజాయి వినియోగంపై డీసీపీ పి.కరుణాకర్ ఘాటుగా హెచ్చరించారు. గంజాయి వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాదు, కుటుంబాలు, సమాజం కూడా తీవ్రమైన సమస్యల్లో చిక్కుకుంటాయని ఆయన స్పష్టం చేశారు. అక్రమ వ్యాపారం లేదా వినియోగంలో పాలుపంచుకునేవారికి తప్పనిసరిగా కఠిన న్యాయపరమైన శిక్షలు ఎదురవుతాయని ,ఒకసారి క్రిమినల్ రికార్డ్ ఏర్పడితే భవిష్యత్తు చీకటిలో కలిసిపోతుందని ఆయన హెచ్చరించారు.యువత తమ భవిష్యత్తును రక్షించుకోవాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని డీసీపీ పిలుపునిచ్చారు.



## టీవీకే పార్టీ రెండో మహానాడు



**- మధురై తూర్పు నుంచి పోటీచేస్తున్నట్టు సినీ హీరో విజయ్ ప్రకటన**

**- భారీగా తరలివచ్చిన అభిమానులు**

**- తోపులాటలో 400 మంది అస్వస్థత**

**మదురై :**

తమిళగ వెట్రి కళగం (టీవీకే) రెండో మహానాడు గురువారం మదురైలో భారీ ఎత్తున జరిగింది. ఈ సభకు స్టార్ హీరో విజయ్ అభిమానులు ఊహించని స్థాయిలో తరలివచ్చారు. దీంతో సభ ప్రాంగణమంతా రద్దీతో కిక్కిరిపోయి, తోపులాటలు చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 400 మంది స్పృహ కోల్పోగా, వారిలో ఒకరు దుర్మరణం చెందారు. మరో 12 మందికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. సభ ప్రారంభానికి ముందే వేదిక వద్ద ఏర్పాటు చేసిన 100 అడుగుల జెండా స్థంభం విరిగి కారు పై పడటంతో వాహనం ధ్వంసమై, అందులో ఉన్న వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. భద్రతా చర్యల కోసం 3 వేల మంది పోలీసులు, 2 వేల ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది, 500 మహిళా బౌన్సర్లను నియమించారు. అరుప్పుకోట్టైతూత్తుకుడి సాలై వద్ద సుమారు 500 ఎకరాల్లో సభ వేదికను సిద్ధం చేశారు. రెండు లక్షల మంది కూర్చునేలా గ్యాలరీలు, వాహన పార్కింగ్, తాగునీటి సదుపాయాలు, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను కూడా ఏర్పాటు చేశారు. అభిమానుల మధ్యకు విజయ్ నడిచి వచ్చేలా 300 మీటర్ల పొడవైన ప్రత్యేక ర్యాంపు నిర్మించారు.ఈ వేదిక నుంచే విజయ్ తన రాజకీయ బరిలో అడుగుపెట్టారు. మదురై తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ప్రకటించి ఎన్నికల శంఖారావం పూరించారు. కేంద్రంలోని ఎన్డీయే, రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వాలపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. నీట్ పరీక్షను ప్రధాని మోదీ రద్దు చేయగలరా? అని సవాల్ విసిరారు. శ్రీలంక నేవీ దాడుల్లో 800 మంది తమిళ మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేస్తూ, కట్చతీవు ద్వీపాలను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# గణేష్ మండపాలకు ఆన్లైన్ నమోదు తప్పనిసరి : గంగాధర ఎస్.ఐ



**జనం పవర్ గంగాధర ఆగస్టు 21:**

గంగాధర మండలంలోని గ్రామాలలో గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్లైన్‌లో నమోదు చేసుకోవాలని స్థానిక ఎస్.ఐ. వంశీ కృష్ణ తెలిపారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు సులభతరం చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన పోర్టల్ (http://policeportal.tspolice.gov.in/index.htm) ద్వారా వివరాలు నమోదు చేసి, అప్లికేషన్‌ను పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. ఈ పోర్టల్ కేవలం మండపాల నిర్వహణకు సంబంధించిన సమాచారం కోసం మాత్రమే ఉద్దేశించబడిందని తెలిపారు. అలాగే గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసే ముందు నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు సమాచారం పోలీస్ స్టేషన్‌కి అందజేయాలని, ఇందుకు కంప్యూటర్ లేదా మొబైల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మకూడదని హెచ్చరించిన ఎస్.ఐ. వంశీ కృష్ణ, ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్‌కి వచ్చి వివరణ పొందవచ్చని, లేక 100 కి కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# ఉద్యమకారులకు సత్వరం న్యాయం చేయాలి




**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పోస్ట్ కార్డుల ద్వారా విన్నపం**

**జనం పవర్, మంథని,ఆగస్టు 21:**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై దశాబ్ద కాలం దాటిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంలో అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారుల ఊసే లేకుండా పరిపాలన కొనసాగించిందని వారు గుర్తు చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారుల డిమాండ్లన్నీ నెరవేరుస్తామని హామీ ఇవ్వడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర ఎంతో కీలకమైందని వారు ఈ సందర్భంగా అన్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి వద్ద ఎన్ని సార్లు గోడు వెళ్ళబోసుకున్న పట్టించుకోకపోవడంతో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీకి గురువారం పోస్టు కార్డుల ద్వారా వివరించినట్లు వారు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందుపట్ల సునీల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంథని విజయ్ కుమార్, నియోజకవర్గ ఇన్చార్జి గోగుల రాజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫారం నాయకులు గుర్రం దేవేందర్,దేవల్ల విజయకుమార్, ఎండి సర్వర్, కోసినేని రమేష్, కాజీపేట సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్‌లో దారుణం..



**ఐదుగురు ఒకే కుటుంబం మృతి**

**డెత్ మిస్టరీ.. వారిది ఆత్మహత్యా.. హత్యా**

**మియాపూర్ :**

నగరాన్ని కుదిపేసే ఘటన మియాపూర్ మక్త మహబూబ్‌పేట కాలనీలో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఓ ఇంటిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందారు. ఈ సంఘటనతో ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ పెద్ద ఉప్పరి లక్ష్మయ్య (60), ఆయన భార్య వెంకటమ్మ (55), కుమార్తె కవిత (24), అల్లుడు అనిల్ (32), రెండేళ్ల చిన్నారి అప్పు మృతదేహాలుగా లభ్యమయ్యారు. ఇంటి తలుపు తట్టగా ఎటువంటి స్పందన రాకపోవడంతో స్థానికులు అనుమానించి లోపలికి వెళ్లి చూసి షాక్‌కు గురయ్యారు.

సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు వెంటనే క్లూస్ టీమ్‌తో చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఇంట్లో ఉన్న ఆధారాలను సేకరించిన పోలీసులు ఇది ఆత్మహత్యా ? లేక హత్యా ? అన్న కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. అసలు మరణానికి గల కారణం ఇంకా బయటపడలేదు. ఇలాంటి సంఘటనలు గతంలోనూ సంచలనం రేపాయి. 2025 జనవరిలో బెంగళూరులో టెకీ అనూప్‌కుమార్, భార్య రాఖీ, ఇద్దరు చిన్నారులు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గుర్తుకొస్తోంది. మియాపూర్ ఘటన వెనుక అసలు నిజం ఏంటనేది పోలీసుల దర్యాప్తుతోనే వెలుగులోకి రానుంది.

# కేటీఆర్ భాష థర్డ్ క్లాస్

**మంత్రి పొన్నం హాట్ కామెంట్స్**

**కరీంనగర్ టౌన్ :**



తెలంగాణకు చెందిన సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఇండియా కూటమి ఎంపిక చేయడం గర్వకారణమని రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం కరీంనగర్ డిసీసీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద రైతు కుటుంబం నుంచి వచ్చి హైకోర్టు, సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన సుదర్శన్ రెడ్డి వంటి వ్యక్తి రాష్ట్ర ప్రతిష్టను పెంచుతారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ పై విమర్శలు గుప్పించిన ఆయన ఎప్పుడూ గోడమీద కూర్చున్నట్టుగా ఉన్న బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో నిజానిజాలను ప్రజలకు చెప్పాలి. బీజేపీ వెంట నడుస్తారా లేక తెలంగాణ బిడ్డకు మద్దతు ఇస్తారా అనే విషయం వారి వివేకానికే వదిలేస్తున్నాం అన్నారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ యూరియా ఎవరు ఇస్తే వారికి ఓటు వేస్తామని చెబుతున్న భాష థర్డ్‌క్లాస్ స్థాయిలో ఉంది. పదేళ్లు మంత్రిగా ఉన్న ఆయనకు యూరియా పూర్తిగా కేంద్రం పరిధిలో ఉంటుందని తెలియదా ? అని ప్రశ్నించారు. తెలంగాణపై ఉద్దేశపూర్వకంగా వివక్ష చూపుతూ రైతులను భయభ్రాంతులకు గురిచేయాలన్న ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500 రూపాయలకే గ్యాస్, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ, సన్న బియ్యం పంపిణీ, సన్న వడ్లకు 500 బోనస్, 60 వేల ఉద్యోగాల భర్తీ, 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా, గురుకులాల మెస్ చార్జీల పెంపు వంటి పథకాలు తెలంగాణలో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేస్తూ, యూరియా సరఫరా విషయం పై ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, పార్లమెంట్ సభ్యులు ఇప్పటికే కేంద్ర ఫెర్టిలైజర్ మంత్రిని కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంలో బీజేపీ జాతీయ నేత బండి సంజయ్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూడా మంత్రి స్పందిస్తూ రెండో టీఎంసీ అసలు రాలేదు. అయినా మూడో టీఎంసీ పనులు ఎందుకు మొదలుపెట్టారు ? అని ఆయన ప్రశ్నించారు. గత పది సంవత్సరాలుగా కరీంనగర్ జిల్లాకు బీజేపీ ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని సవాలు విసిరారు. అలాగే కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని ఇప్పటికే ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారని, ఆయనకు విశాల స్థాయి మద్దతు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు



# సింగరేణి అవార్డు గ్రహీత బొమ్మకకు సన్మానం

**జనం పవర్, రామగుండం ఆగస్టు 21:**

మాల సంఘం కళాబృందం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు సింగరేణి కార్మికుడు బొమ్మక వెంకటేశ్వర్లు కు ఈరోజు మాల సంఘం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు వక్తలు మాట్లాడుతూ రానున్న కాలంలో వెంకటేశ్వర్లకు దేవుడు అన్ని విధాల సహకరించి ఉన్నత పదవులను అధిరోహించాలని అలాగే మాల సంఘం నకు తన యొక్క సేవలు అందించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మర్రి ఐలయ్య జనరల్ సెక్రటరీ మాలెం మధు రామగుండం నియోజకవర్గం ఇంచార్జ్ మరియు దేవా వెంకటేశం వీరితోపాటు జన విజ్ఞాన పరిషత్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు ఎరుకల లక్ష్మణరావు మాల సంఘం సమన్వయకర్త నంది నరేష్ కొండ కుమార్ కడమండ శ్రీహరి మాజీ అధ్యక్షులు పిట్టల వెంకటి ఎరుకల లింగమూర్తి అందువల్ల లింగయ్య, జన విజ్ఞాన పరిషత్ జూపాక పోశం ఆనంద్ కొండ సురేష్ దాసరి రామస్వామి దాసరి రమేష్, నంది నగేష్ నూకల మొండి దాసరి వెంకటేశ్వర్లు అధిక సంఖ్యలో మాల కుల బంధువులు అధిక సంఖ్యలో సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం..!

**మోడీ పాలనలో స్వతంత్ర వ్యవస్థలు నాశనం!**

*** సిపిఐ(ఎమ్.ఎల్) మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి**

**జనం పవర్,గోదావరిఖని ఆగస్టు 21:**




సిపిఐ(ఎమ్.ఎల్) మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పోటు రంగారావు,రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ కట్ల రమ సహా ఇతర నాయకులు పాల్గొని,భారత ఎన్నికల కమిషన్ పూర్తిగా వైఫల్యం చెందిందని,బీహార్ వంటి రాష్ట్రాల్లో 60 లక్షల ఓట్లను మళ్లీ జాబితా నుంచి తొలగించి బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నికలు జరుగుతున్నట్టు స్పష్టమైందని ఆరోపించారు.ప్రధాన ప్రతిపక్ష నేతల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా,బెదిరింపు ధోరణితో ఎన్నికలు నిర్వహిస్తున్న ఎన్నికల కమిషన్‌పై ప్రజలు నమ్మకం కోల్పోయిన నేపథ్యంలో కమిషన్ తక్షణం రాజీనామా చేయాలన్న డిమాండ్ చేశారు.మోడీ ప్రభుత్వం భారతదేశంలోని అన్ని స్వతంత్ర సంస్థలను తన నియంత్రణలో పెట్టి వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నందున ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందని,సమస్యలను ప్రశ్నించే గొంతుక కూడా నిస్పృహంగా చేసేస్తున్నదని తెలిపారు.తెలంగాణ రైతుల కోసం 12-15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని,కేంద్రం ఇప్పటివరకు కేవలం 7 లక్షల మెట్రిక్ టన్నులే కేటాయించిందని, వెంటనే సరిపడా యూరియాను అందించాల్సిన అవసరం ఉన్నదని,సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని,రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రెస్ మీట్‌లో సిపిఐ(ఎమ్.ఎల్) మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ నంది రామయ్య,ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్,జిల్లా నాయకులు తోకల రమేష్,జాడి దేవరాజ్,జిందం రాంప్రసాద్,గుమ్మడి వెంకన్న, పెండ్యాల రమేష్,ఆడేపు శంకర్,గొల్లపల్లి చంద్రయ్య,ఈసంపెల్లి రాజేందర్,పురంశెట్టి బాబు,పుల్లూరి నాగభూషణం,గూడూరి వైకుంఠం,ఋషిపాక దేవయ్య, చిలుక రాజు తదితరులు పాల్గొన్నారు.





# నారాయణపూర్ రిజర్వాయర్ విషయంపై మాట్లాడే అర్హత రవిశంకర్‌కు లేదు

**కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్**

**జనం పవర్ గంగాధర ఆగస్టు 21:**

గంగాధర మండలం మధురానగర్ ప్రజా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ మాట్లాడుతూ నారాయణపూర్ రిజర్వాయర్‌పై మాట్లాడే అర్హత మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్‌కు లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి నారాయణపూర్ నిర్వాసితుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు. రైతు సమస్యలు పట్టించుకోకుండా, పంటలు ఎండిపోతే “రాళ్ల వర్షం పడి నష్టపోయాం అనుకోవాలి” అనే నిర్లక్ష్య సమాధానం ఇచ్చిన చరిత్ర రవిశంకర్‌దేనని అన్నారు. అదే సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఏడాది కాలంలోనే నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి కోసం రూ.43 కోట్లు మంజూరు చేయించారని, రైతు సమస్యలపై, ప్రజా సంక్షేమంపై పూర్తి అవగాహనతో పనిచేస్తున్నారని ప్రశంసించారు.పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నారాయణపూర్ నిర్వాసితులకు న్యాయం చేయలేకపోయిందని, అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేసిందని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పుట్టిన ఊరికి ఒక్క రూపాయి పరిహారం కూడా ఇప్పించలేదని విమర్శించారు. “నారాయణపూర్ గ్రామానికి నువ్వు ఏం చేశావు? మధురానగర్ చౌరస్తాలో చర్చకు సిద్ధమా?” అని సవాల్ విసిరారు. ప్రజల కోసం కృషి చేసే నాయకుడు మేడిపల్లి సత్యమని, అబద్ధపు ప్రచారం చేస్తే కాంగ్రెస్ ఆధ్వర్యంలో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుబ్బసి బుచ్చన్న, జాగిరపు శ్రీనివాస్ రెడ్డి, బూర్గు గంగన్న, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, రోమాల రమేష్, సాగి అజయ్ రావు, వేముల అంజి, మంత్రి మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి చట్టాలను కాపాడాలి



**ఉద్యమకారుల పిలుపు"**

**జనం పవర్, పెద్దపల్లి ఆగస్టు 21:**

హిందుత్వ మతతత్వాన్ని కొనసాగిస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న "నర మేధా-కగార్"కు వ్యతిరేకంగా ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 24వ తేదీ ఉదయం 10 గంటలకు అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న బహిరంగ సభను ప్రజాస్వామ్యవాదులు, అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని ఏ.ఐ.ఎ ఫ్.టి.యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రత్నకుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎం. రాయమల్లు, రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసి హక్కులు పరిరక్షించబడాలని, కార్పొరేటీకరణ పేరుతో జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, ఆపరేషన్ కగార్ పేరిట జరుగుతున్న హత్యాకాండను నిలిపివేయాలని, పెసా వంటి ఆదివాసి చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టుల పేరుతో నిరపరాధి ఆదివాసులను హతమారుస్తూ, దండకారణ్యంలోని అపార ఖనిజ సంపదను ఆదాని, అంబానీల వంటి పెద్ద కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు మోదీ-అమిత్ షా ప్రభుత్వం క్రూరమైన నిర్బంధానికి పాల్పడుతోందని వారు తీవ్రంగా విమర్శించారు. ఉద్యమకారులను అక్రమ కేసులతో జైళ్లకు నెట్టడం, పౌరహక్కుల సంఘాలను అణగదొక్కడం ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పని పేర్కొన్నారు. బస్టర్‌లో ఏర్పాటు చేసిన వందలాది సాయుధ బలగాల శిబిరాలను తక్షణమే ఎత్తివేసి, కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ఆదివాసీల రాజ్యాంగబద్ధ హక్కులను పూర్తిగా అమలు చేయాలని, 1996 పెసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం, ఐదో-ఆరవ షెడ్యూల్‌లను, గ్రామసభల తీర్మానాలను గౌరవించాలని, నిరపరాధులపై జరుగుతున్న నరమేధాన్ని నిలిపివేసి దేశంలో శాంతి నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇల్లు అందని ద్రాక్షేనా..?

(జనం పవర్, వరంగల్ బ్యూరో)
ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదలకు అందని ద్రాక్షగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పేదలకు ఇందిర మ్మ ఇండ్లు ఇస్తున్నామనే ప్రచారం ప్రచారంగానే మిగిలిపోతోందని పలువురు ఆరోపించారు. ముఖ్యమంత్రి తోపాటు అధికార ప్రజాప్రతినిధులు పలు సందర్భాల్లో ఇందిరమ్మ ఇండ్ల విషయం ప్రస్తావిస్తున్నారు. దీనితో నిజమైన లబ్ది దారులు కొండకు ఎదురు చూసినట్లు చూస్తున్నారు. అయినా వాళ్ళ ఆశలు నెరవేరడం లేదు.గజం భూమి లేనోళ్ళు ఇందిరమ్మ ఇండ్లు ఎక్కడ కట్టు కుంటారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ లెక్కన ఎన్ని వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం కాకుండా ఆగిపోతాయని పరిశీలకులు భావిస్తున్నారు. పలుచోట్ల లబ్దిదారులకు ఖాళీ స్థలం ఉంటేనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నారు. మరి ఖాళీ స్థలం లేనోళ్ల పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తు న్నారు. అది కూడా వంద గజాల స్థలం ఉండాలని, అంతకు ఏమాత్రం తక్కువగా ఉన్నా ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు కావనే ప్రచారం జోరుగా సాగుతోంది.ప్రజల్లో అనుమానం వెంటాడుతునట్లు సమాచారం.

**లబ్ధిదారులకు రూ.6 లక్షలు**

ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు రూ. 5 లక్షలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నారు. అయితే మూడవ జాబితాలో పేర్లున్న లబ్దిదారులకు రూ. 6 లక్షలకు ఇల్లు నిర్మిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనితో లబ్దిదారుల్లో కొందరికి ఆశలు పెరిగాయి. ఇదిలావుంటే అట్టి లబ్దిదారులు నిర్మాణదారులకు ముందుగా రూ.2లక్షలు చేతికిస్తే మూడవ జాబితా లబ్దిదారులకు అనుకున్నట్లుగా ఇల్లు నిర్మాస్తారనే ప్రచారం కూడా విస్తృతంగా సాగుతోంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రచారం దావానంలావ్యాపించినట్లు చెప్పుకొంటు న్నారు. మన అవసరాలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తారని గ్రామస్తులు చెప్పుకుంటున్నట్లు తెలిసింది. కొందరు రూ.2 లక్షలు చొప్పున ఇండ్ల నిర్మాణ నిర్వాహకులకు ఇచ్చినట్లు తెలిసింది.



**భూమిలేనోళ్ల పరిస్థితి...?**

అంతా బాగానే ఉంది. అయితే భూమి లేనోళ్ల పరిస్థితి ఏంటనే ప్రశ్నలు సర్వత్రా తలెత్తుతున్నాయి. ఇండ్లు లేని నిరుపేదలు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లకు అర్హులని, ఇందులో ఏ ఒక్కరికీ ఇళ్లున్నా వెంటనే వారిని అనర్హులుగా ప్రకటిస్తామని పదే పదే చెప్పిన మంత్రి ఎటువంటి అస్తిపాస్థులు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు దక్కవా...? అనే అభిప్రాయాన్ని కొందరు పేదలు వ్యక్తం చేశారు. అంతేకాదు భూమి లేక అద్దెకుంటున్న పేదలకు ఒకవేళ ఇందిరమ్మ ఇల్లు మంజూరైతే లబ్దిదారుల పరిస్థితి ఏంటన్నది తెలియకుండా ఉంది. మొత్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు ప్రశ్నార్థకంగా మారింది.

## వీరబోయిన సైదులు యాదవ్ మృతదేహానికి ఘన నివాళి

**బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాధగోని శ్రీనివాస్‌గౌడ్**



**జనం పవర్, మాడుగులపల్లి, ఆగస్టు 21:** మాడుగులపల్లి మండలంలోని చెరువుపల్లి గ్రామానికి చెందినవికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు, బిజెపి నాయకుడైన వీరబోయిన సైదులు యాదవ్ గురువారం అనారోగ్యంతో మరణించారు.స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మా దగోని శ్రీనివాస్ గౌడ్ వారి స్వగృహానికి వచ్చి మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులకు 10,000 రూపాయలుఆర్థిక సహాయం అందజేశారు.వారి వెంట కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఇటికాల జాన్‌రెడ్డి, తిప్పర్తి మండల అధ్యక్షులు వంగూరి రవి, వడ్డే శ్రీనివాస రెడ్డి, చిలుముల శ్రీనివాసరెడ్డి, మర్రి నాగరాజు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి




**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 21:** వనపర్తి బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్ ఎన్నికైన మొదటిసారిగా వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఉన్న డిపిఆర్ఓ కార్యాలయాన్ని సందర్శించి, సీతారాం ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, బొకేతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులో ఉన్నటువంటి సమస్యలు అక్రిడేషన్ కార్డు, హెల్త్ కార్డు, ఉచిత బస్‌సౌకర్యం, ఇళ్ల స్థలాల కేటా యింపు తదితర అంశాలపైన చర్చించి త్వరగా మీ పరిధిలో ఉన్నటువంటి అంశాలను పరిష్కరించాలని చర్చించచారు.

## కుటుంబ సంక్షేమ నిధి ఉపాధ్యాయుల పాలిట వరం

**జనం పవర్, చింతపల్లి( నల్గొండ), ఆగస్టు 21:** ఇటీవల అకాల మరణం చెందిన చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీరందాస్ యాదగిరి సంస్మరణ సభ, ఆరు లక్షల చెక్కు పంపిణీ కార్యక్రమం బుధవారం సాయంత్రం హైదరాబాద్ మన్నెగూడలో వారి స్వగృహంలో టీఎస్ యుటిఎఫ్ చింతపల్లి మండల అధ్యక్షులు శిలవేరు నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఐక ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవెంకట్ గారు మాట్లాడుతూ కుటుంబ సంక్షేమ నిధి అనేది ఒకరి కోసం అందరంఅందరి కోసం ప్రతిఒక్కరం అనే నినాదంతో టీ ఎస్ యుటిఎఫ్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కుటుం బాల సంక్షేమం కోసం 2023 మే 2వ తేదీన ప్రారంభించబడి జూలై 1 నుండి అమలులోనికి వచ్చింది అని తెలిపారు. ఈపథకం ద్వారా ఇప్పటివరకు మద్యంతరంగా మరణించిన 44 మంది ఉపాధ్యాయుల కుటుంబాలకు 6 లక్షల చొప్పున రెండు కోట్ల 64 లక్షలు రూపాయలు పంపిణీ చేశామని అన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ఆరు లక్షల రూపాయల కుటుంబ సహాయనిది చెక్కును అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కుటుంబ సంక్షేమ నిధి చైర్మన్ ఎం రాజశేఖర్ రెడ్డి, చింతపల్లి మండల విద్యాధికారి నీరుడు అంజయ్య, టీఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, ఉపాధ్యాయులు తిరుపతయ్య, బిక్షమయ్య, యాదగిరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి



**జనం పవర్, మాడుగులపలి, ఆగస్టు 21:** మాడుగులపల్లి మండలంలోని ఆగమొత్కూర్ ఇందుగుల గ్రామాలలో పిహెచ్‌సిలను గురువారం మండల ప్రత్యేక అధికారి జి వెంకటేశ్వర్లు పరిశీలన చేసి అనంతరం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధం డెంగ్యూ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆగమొత్కూర్ ప్రభుత్వ పాఠశాలలో సీజనల్ వ్యాధుల గురించి అంటూ వ్యాధులు రాకుండా చుట్టు ప్రక్కల పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు అందవలసిన పోషకాల గురించి బాలింతలకు గర్భిణులకు ప్రభుత్వం నుండి వచ్చే పోషక పదార్థాలు అందజేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సరోజ పావని డిప్యూటీ తాసిల్దార్ కత్తుల సైదులు ఆర్ఐలు నాగయ్య రేణుక ఇన్చార్జ్ ఎంపీడీవో సంగీత, డాక్టర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఓయు జేఏసీ బంద్‌కు విశ్వకర్మల సంపూర్ణ మద్దతు

**జనం పవర్, హుజురాబాద్ టౌన్, ఆగస్టు 21:** తెలంగాణ సమాజంపై మార్వాడీలు కత్తి పెట్టారని విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షులు తాటికొండ శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్వాడి వ్యాపారాలు చేసే వ్యాపారాల వల్ల విశ్వకర్మల వృత్తి పూర్తిగా దెబ్బతింటున్నదని మండిపడ్డారు. మార్వాడీలు విశ్వకర్మల వృత్తిని కబళిస్తున్నారని దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. మార్వాడీలు అన్ని రకాల వ్యాపారాలు చేస్తూ నాణ్యతలేని నాసిరకం వస్తువులు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఈ ప్రాంత వ్యాపారుల వ్యాపారాలు క్షీణించడానికి కారకులవుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. మన ప్రాంతం మన వ్యాపారం అనే నినాదంతో ముందుకు పోవాలని నిర్ణయించు కున్నట్లు పేర్కొన్నారు.మార్వాడీల గోబ్యాక్ ఉద్యమానికి ఓయూ జెఏస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇచ్చిన రాష్ట్ర బంద్ కు విశ్వకర్మల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.ఈ సమావేశంలో విశ్వకర్మ సంఘం నాయకులు నందగిరి శ్రీనివాస్, రాంపల్లి బిక్షపతి,వేమునూరి శ్రీనివాస్, చల్లూరి రఘు, బాణాల సత్యం, నందాచారి, బిక్షపతి ,పంచకోటి సత్య నారాయణ, బండ్లోజు లింగమూర్తి, రాంపల్లి రాజ్‌కుమార్, నాంపల్లి మహేందర్, విద్యాసాగర్ పాల్గొన్నారు.




## జమ్మికుంట ప్రభుత్వ మహిళ హాస్టల్‌లో వైద్యశిబిరం

**జనం పవర్, జమ్మికుంట, ఆగస్టు 21:** జమ్మికుంట మున్సిపల్ పరిధి ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాల గర్ల్స్ హాస్టల్‌లో, డాక్టర్ చందన ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 5మంది విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. అదేవిధంగా వర్తక సంఘం ఏరియాలో డాక్టర్ మహోన్నత పటేల్ ఆధ్వ ర్యంలో వైద్య శిబిరం నిర్వహించి 58 మంది కాలనీ వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. ముగ్గురు జ్వర పీడితులకి రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కి పం పించారు. జమ్మికుంట పరిధిలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో డాక్టర్ బిందు 30 మంది గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు మందులు పంపిణీ చేశారు. ముగ్గురు జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలను సేకరించి వ్యాధి నిర్ధారణకు ల్యాబ్ కు పంపించారు.ఈ వైద్య శిబిరాలకు వచ్చిన ప్రజలకు అసంక్రమిత వ్యాధులు రక్త పోటు,మధుమేహం పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు ఇచ్చారు.ఈ సందర్బంగా గ్రామస్తులకి సీజనల్ వ్యాధులు మలేరియా,డెంగీ,చికెన్ గున్య మొదలగువ్యాధులు వ్యాపించు విధానం,వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి క్లుప్తంగా వివరించి చెప్పారు. ఈ కార్యక్రమములో డాక్టర్ చందన,డాక్టర్ మహోన్నత పటేల్,డాక్టర్ బిందు,హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి,హెల్త్ సూపర్ వైజర్స్ రత్నకుమారి,సదానందం,హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్‌ఎమ్ ఎస్ మంజుల, రజిత, రాదా, ఆశా కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రణవ్



**జనం పవర్, హుజురాబాద్ టౌన్, ఆగస్టు 21:** ప్రభుత్వం వైద్య రంగానికి సంబంధించి అధిక ప్రాధాన ఇస్తున్నామని,దాంట్లో భాగంగా హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకోవడానికి తనిఖీ చేశామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున హుజూరాబాద్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.దవాఖానలో ఎలాంటి చికిత్స అందిస్తున్నారని, ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని నేరుగా రోగులను అడిగి తెలుసుకున్నారు.తనిఖీ చేసే సమయంలో పలు సమస్యలు ప్రణవ్ దృష్టికి తీసుకురాగా వాటిని అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపిస్తామని అన్నారు. ప్రణవ్ వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 21 :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని ప్రజా సేవకులు వజ్రాల రమేష్ తెలి పారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని 24వ వార్డు బండారు నాగర్ లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి, ఎదుగుదలకు అహారం చాలా అవసరం. ఇందుకోసం మెనూ ప్రకారం భోజనం అందించడం, బియ్యం నాణ్యతను పరీక్షించడం, ఆహారంలో పురుగులు లేవని నిర్ధారించుకోవడం, వంటశాల పరిశుభ్రత పాటించడం, వంట సిబ్బందికి సూచనలు ఇవ్వడం వంటివి నాణ్యమైన ఆహారం అందించడానికి ప్రధానోపాధ్యాయులు కృషిచేయాలి అన్నారు. విద్యార్థులకు సమతుల్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలి.విద్యార్థులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి.ఈ చర్యలు తీసుకోవడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా పెరిగి, మంచి విద్యను అభ్యసించ గలుగుతారు అని తెలిపారు గురువారం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని వజ్రాల రమేష్ పరిశీలించారు. స్పందించిన ప్రధానో ఉపాధ్యాయులు విద్యార్థులకు పోషకాహారం అందిస్తామని తెలిపారు.

## ఎస్‌జిఎఫ్ క్రీడల నిర్వహణపై సమావేశం



**జనం పవర్, హుజురాబాద్ టౌన్ ఆగస్టు 21:** ఎస్‌జిఎఫ్ క్రీడలు 2025 -26 సంవత్సరానికిగాను నిర్వహణకై గురువారం స్థానిక మండల అధికారి బి.శ్రీనివాస్ అధ్యక్షతన ఎంఆర్‌సి హుజురాబాద్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పిఈడి, పిఈటిలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్రీడల నిర్వహణ తేదీలను నిర్ణయించినారు.గత సంవత్సరం మాదిరిగానే ఎస్జీఎఫ్ క్రీడలని విజయవంతంగా నిర్వహించాలని మండల విద్యాధికారి బి.శ్రీనివాస్ పిఈడి పీటిలకు సలహా సూచనలు ఇచ్చారు. ఇట్టి సమావేశంలో మండల ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ చిరుత శ్రీనివాస్ మరియు మండలంలోని పిఈడి, పిఈటిలు పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్‌యుఐ ఆధ్వర్యంలో సుధీర్‌కుమార్‌కు సన్మానం




**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 21:** వనపర్తి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ పెం డెం నాగన్న యాదవ్ కుమారుడు పెండెంసుధీర్ కుమార్ ఇటీవల ఇస్రో(భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) నిర్వహించిన పోటీ పరీక్షలలో జాతీయ స్థాయిలో 51వ ర్యాంక్ సాధించి శాస్త్రవేత్తగా ఎంపికైన సందర్భంగా గురువారం వనపర్తి జిల్లా ఎన్‌ఎస్యుఐ నాయకులు బి.శ్రీకాంత్,గంధం కుమార సంగకర, అనిల్ కుమార్, ఎంజీ నబీల్ ,కె శివ,గంధం సుకుమార్, భాను ఘనంగా సన్మానించి అభినందించారు.

## అన్నప్రసాద దాతలకు స్వాముల సత్కారం

**జనం పవర్, జమ్మికుంట, ఆగస్టు 21:** జమ్మికుంట ఇందిరానగర్‌లోని పంచముఖ హనుమాన్ దేవాలయంలో, గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా హనుమాన్ స్వాముల మాలధారణ అయినటువంటి స్వాములకు, 21రోజు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించిన పొనగంటి మమత రవికుమార్‌లకు హనుమాన్ మాలధారణ స్వాములు శాలువా కప్పి సన్మానించారు.

# ఔట్ సోర్సింగ్ ఆగడాలు..?

**- నేతల అండదండలు - రెచ్చిపోతున్న కాంట్రాక్టర్లు**



**వరంగల్ బ్యూరో, జనం పవర్:** ఔట్ సోర్సింగ్ ఆగడాలు మితిమీరుతున్నాయి. ఈ కొలువుల్లో చేరామంటే బతుకులు బాగుపడతాయని, కష్టాలు తీరుతాయని నిరుద్యోగుల అనేక రకాలుగా కలలు కంటారు. ఇందుకోసం అప్పులు చేయడానికి కూడా వెనకాడరు. దీన్ని సాకుగా తీసుకునే కొందరు కాంట్రాక్టర్లు తమదైన స్టైల్లో దందా నడుపుతున్నారు. ఈ క్రమంలో వారికే అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టులు అవకాశాలు వచ్చినప్పటికీ. ఒక్కో శాఖలో ఉద్యోగానికి ఇంత అని బేరమాడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చాలా మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగమంటే సర్కారు ఉద్యోగంగానే భావిస్తారు. ఈ నేపథ్యంలో కొందరు కాంట్రాక్టు నిర్వహకుల ఆగడాలు మితిమీరి పోతున్నాయి. అయినా పట్టనట్లుగా, కొందరు ఉన్నతాధికారులు కుర్చీలకు అతుక్కుపోతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అధికారులకు తెలిసినా తమకేం తెలియదన్నట్టు పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉంటే పైరవికారులు కొందరు ఆ ఉద్యోగం, ఈ ఉద్యోగం ఇప్పిస్తామని చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఆస్పత్రులు,, మున్సిపల్, రెవెన్యూ, సింగరేణి తదితర ప్రభుత్వ శాఖల్లో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. రూ. 30 వేలు నుంచి లక్షలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగ నియామకాలకు ఉద్యోగార్హత పేరిట పరీక్షలు నిర్వహిస్తూ నిరుద్యోగులకు గాలం వేయడంలో కొన్ని అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టర్లు అతి తెలివిగా వ్యవహరిస్తున్నారు. డబ్బులు తీసుకుంటూ కూడా నిరుద్యోగులను బుట్టలో వేసుకునేందుకు తెర వెనకాల అనేక నాటకాలు ఆడుతున్నారు. ఇదిలావుంటే అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల విషయంలో కొం దరు కాంట్రాక్టు నిర్వాహకులు అమ్మాయిలకు లేనిపోని ఆశలు చూపిస్తున్నట్లు తెలిసింది. కాంట్రాక్టు నిర్వహ కులతో కొందరు బడా నేతల అండదండలు ఉండటం వల్ల నిర్వాహకులు రెచ్చిపోతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వరుస కాంట్రాక్టులు కూడా వారికే చెందుతున్నట్లు పలువురు ఉద్యోగులు ఆరోపించారు.

**ఉత్తుత్తి పరీక్షలు..!**

కొత్తగా ఉద్యోగంలోకి చేర్చుకునే నిరుద్యోగులకు ఔట్ సోర్సింగ్ నిర్వాహకులు వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిరుద్యోగులకు నిర్వాహకుల పట్ల నమ్మకం కుదరడం కోసం తమకు తెలిసిన కళాశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అయితే ఆయా కేంద్రాల్లో ఎటువంటి వసతులు ఉండవని, నామమాత్రపు పరీక్షలు ఏర్పాటు చేసి గంట తర్వాత అయిపోయిందని చెప్పి పంపిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. సీస్టం ఆపరేట్, ఇతర కొలు వులకు కూడా పరీక్షలు నిర్వహించి మమా అనివి స్తున్నారని, అటు తర్వాత ఏవో సాకులు చెప్పి కొలువు కింత అని బేరమాడుతున్న కొందరు కాంట్రాక్టర్ల తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని పలువురు బాది, తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రభుత్వ, ప్రయి వేటు సంస్థల్లో ఔట్ సోర్సింగ్ నిర్వాహకులు చెప్పిందే వేదంగా కొందరు అధికారులు కూడా వారికి వంత పాడు తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఔట్ సోర్సింగ్ ఆగడాలును నివారించాలని యువత కోరుతున్నారు.

## జిన్నారంలో 24న కోర్టు భవనం ప్రారంభం



**జనం పవర్, పటాన్‌చెరు (జిన్నారం):** జిన్నారం మున్సిపల్ కేంద్రంలో ఈ నెల 24న కోర్టు భవనాన్ని ప్రారంభించనున్నట్లు మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, అడ్వకేట్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం వారు కోర్టు భవనం పరిసరాలను పరిశీలించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా న్యాయమూర్తులు హాజరుకానున్నారని వారు వెల్లడించారు. కోర్టు ప్రారంభంతో సర్కిల్ పరిధిలోని జిన్నారం, బొల్లారం, గుమ్మడిదల, హత్నూర ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ కానున్నాయని స్పష్టం చేశారు.

మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మాణిక్యం, అడ్వకేట్లు, నాయకులు నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం తప్పని తిప్పలు



**జనం పవర్, నకిరేకల్, ఆగస్టు 21:** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో యూరియా కోసం రైతులు గురువారం ఉదయం నుంచి భారీ క్యూలైన్‌లో గంటల తరబడి వేచి చూశారు. తీరా చూస్తే అక్కడ వచ్చింది కేవలం 400 బస్తాలు ఉండగా, వెయ్యి మంది రైతులు పడిగాపులు కాసి తీవ్ర నిరాశ చెందారు.ఇదే అదునుగా భావిస్తున్న ఫర్టిలైజర్ దుకాణ యజమానులు పురుగుల మందులను అంటగడుతూ యూరియాను ఇస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. అక్రమంగా ఫర్టిలైజర్ దుకాణాలకు తంలించడం వల్లనే ఇబ్బందులు అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. వెంటనే ప్రభుత్వం రైతులందరికీ సరిపడే యూరియా అందించాలని రైతులు కోరుతున్నారు.

# రైతులకు పంట నష్టపరిహారం అందజేయాలి

**మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే**



**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 21:** కొంతకాలంగా కురుస్తున్న భారీ వర్షాలకు జుక్కల్ నియోజకవర్గ వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే డిమాండ్ చేశారు. గురువారం డోంగ్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు పంట పెట్టుబడి సాయంగా రైతుబంధును అందించే వారని చెప్పారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాయ ప్రజలకు మాటలు చెప్పి గద్దె ఎక్కాక రైతులను విస్మరించిందని మండిపడ్డారు. రైతులకు అందించాల్సిన రైతుబంధును నాలుగు సీజన్లకు గాను ప్రతి ఎకరాకు 30 వేల రూపాయలను అందించాల్సి ఉండగా 11 వేల రూపాయలని అందించిందన్నారు. మిగతా ప్రతి ఎకరాకు19వేల రూపాయలు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందన్నారు. రుణపడి ఉన్న రైతుబంధు మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు వర్షాల వల్ల దెబ్బతిన్న పంట నష్టపరిహారాన్ని కూడా రైతులకు అందజేయాలని కోరారు.

**అధికారులకు ధన్యవాదాలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే**

నాలుగు రోజుల క్రితం కురిసిన నియోజకవర్గంలోని నిజాంసాగర్, కౌలాస్ నాలా ప్రాజెకు లలో ఎగువ భాగం నుంచి వరద నీరు వచ్చి చేరడంతో నిజాంసాగర్, కౌలాస్నాల వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో బిచ్కుంద మండలంలోని శెట్లూర్ గ్రామంలో ముగ్గురు గొర్రెల కాపరులు, రైతుతో పాటు 656 గొర్రెలను ప్రాణాలతో పాటు రక్షించిన అధికారులకు, రెస్క్యూ టీం సభ్యులకు హన్మంత్ షిండే ధన్యవాదాలు తెలిపారు.

## నేడు ఐ సెట్ విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**-వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్**




**జనం పవర్, వరంగల్, ఆగస్టు 21:** రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రకటించిన షెడ్యూల్ ప్రకా రం, టీజీ ఐసెట్ -2025 కౌన్సిలింగ్ ప్రక్రియ ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాల కోసం సర్టి ఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని హెల్ప్ లైన్ సెంటర్లలో ఒకేసారి ప్రారంభం అవుతున్నట్లు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో కౌన్సిలింగ్ మొదలవుతుందని చెప్పారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియ అధికారుల పర్యవేక్షణలో క్రమబద్ధంగా కొనసాగనుంది.

**ఫేస్ -1 షెడ్యూల్**

ఆన్‌లైన్ ఫైలింగ్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్ ఈ నెల 20 నుంచి 28 వరకు కొనసాగుతంది. సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఈ నెల 22 నుంచి 29 వరకు కొనసాగనుంది. ఆప్షన్ ఎంట్రీ ఈ నెల 25 నుంచి 30 వరకు ఉంటుంది. ఆప్షన్ ఫ్రీజింగ్ ఈ నెల 30న చేపడుతారు. సీట్ల ప్రొవిజనల్ అలాట్‌మెంట్ సెప్టెంబర్ 2 వరకు ఉంటుంది. ట్యూషన్ ఫీజు చెల్లింపు, స్వీయ రిపోర్టింగ్ సెప్టెంబర్ 2 నుంచి 5 వరకు ఉంటుంది.

ప్రిన్సిపాల్ డా. బైరి ప్రభాకర్ మాట్లాడుతూ'విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్మించుకునే ఈ కౌన్సిలింగ్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సరైన ఆప్షన్లు ఎంపిక చేసుకోవడంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సులతో నేటి డిజిటల్, కార్పొరేట్ ప్రపంచంలో విస్తృత అవకాశాలువ వస్తాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి కెరీర్ సాధించవచ్చని తెలిపారు. అలాగే విద్యార్థులు తమ డాక్యుమెంట్లు ముందుగానే సిద్ధం చేసుకుని, సమయపాలన పాటించి కౌన్సిలింగ్‌లో పాల్గొనాలని తెలిపారు.

## తెలంగాణకు యూరియా అందించాలి

**- కేంద్ర మంత్రి నడ్డాకు బీఆర్ఎస్ వినతి**

**జనం పవర్, వరంగల్, ఆగస్టు 21:**



తెలంగాణ రాష్ట్రానికి సరిపడా యూరియాను తక్షణమే సరఫరా చేయాలని. కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతలు కేఆర్ సురేష్ రెడ్డి, వద్ది రాజు రవి చంద్ర వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు గురువారం ఢిలీల్లో వారు కేంద్ర మంత్రిని కలిసి యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు తక్షణమే తొలగించాలని విన్నవించారు.

# ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలి

**- ప్రతి హాస్టల్‌ను సందర్శిస్తా - ఎమ్మెల్యే హరీష్ రావు**



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 21:** హాస్టల్‌లోని ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. బుధవారం ఆయన సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో వసతి గృహాల సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ స్థాయి పాఠశాల ల అనుబంధ హస్థళ్లు, కళాశాలల అనుబంధ హాస్టళ్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలోరి విద్యార్థులని కన్నా పిల్లలుగా చూసుకోవాలన్నారు. గత ప్రభుత్వం లో సంక్షేమ హస్థల్స్ అంటే నమ్మకం ఉండేదన్నారు. కానీ ఈ ప్రభు త్వంలో సంక్షోభ హాస్టళ్లుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి దుస్తులు లేక హాస్టల్ విద్యార్తులు అవస్తలు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు ఆరు నెలల నుంచి వచ్చే మెస్, కాస్మోటిక్ చార్జీలు రావడం లేదన్నారు. ముఖ్యమంత్రికి హాస్టల్ విద్యార్థుల అవస్థలు కనపడం లేదన్నారు. స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే రూ. 500 ప్యాకెట్ మని రెండు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి హాస్టళ్లను సందర్శిస్తానని తెలిపారు.

## నాయీబ్రాహ్మణులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 21:** నాయీబ్రాహ్మణులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొత్వల్ కిషన్ నాయి, న్యూ నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు జనగామ సతీష్ నాయి డిమాండ్ చేశారు. బుధవారం వారు పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. నాయీబ్రాహ్మణ కులవృత్తిపై జరుగుతున్న అన్యా యాన్ని నిరసిస్తూ సిద్దిపేట పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, న్యూ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీకి నాయీ బ్రాహ్మణులు స్వచ్ఛందంగా షాపులను బంద్ చేసి పాల్గొంటారని పేర్కొన్నారు. అన్య కులస్తులు, మతస్తులు తమ వృత్తిని నిర్వహిస్తూ కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వృత్తిని వారి కొనసాగించకోనేల జీవోను ఇవ్వాలని కోరారు.

## ముల్కనూర్ ఎస్సైగా రాజు



**జనం పవర్, భీమదేవరపల్లి, ఆగస్టు 21:** భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ ఎస్సైగా రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రెండున్నర సంవత్సరాలుగా విధులు నిర్వహించిన ఎస్సై నండ్రు సాయిబాబు సాధారణ బదిలీలో భాగంగా వర్ధన్నపేటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గీసుకొండ స్టేషన్ నుంచి రాజు బదిలీపై వచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా 13 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు.

## మహిళా పొదుపు సంఘం భవనం ప్రారంభం



**జనం పవర్, బెజ్జంకి, ఆగస్టు 21:** బెజ్జంకి మండల కేంద్రంలో రూ. 12 లక్షల సొంత నిధులతో నిర్మించిన మహిళా పొదుపు సంఘం భవనాన్ని గురువారం వరంగల్ సీడీఎఫ్ అధికారి ఎర్రవెల్లి రేవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత ఖర్చులతో మహిళా పొదుపు సంఘం నూతన భవనం నిర్మించడం శుభ పరిమణామన్నారు. ఈ కార్యక్రమంలో డీవో సుమలత, సిద్దిపేట సమితి మహిళా అధ్యక్షురాలు రాపోలు సమితి ఘనకులు ఉమా, విజయ, సంఘం అధ్యక్షురాలు జడల కవిత, గణకురాలు సంఘలత, సిద్దిపేట సమితి అధ్యక్షుడు చంద్రారెడ్డి, బెజ్జంకి సంఘం అధ్యక్షుడు బొనగం రమేష్, ఉపాధ్యక్షుడు బుర్ర కిషన్, సంఘ రవి, మహిళా అధ్యక్షురాలు బొనాగం వినోద, సంఘ రవళి, నార్ల అనురాధ, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు అందుబాటులో ఉండాలి

మెరుగైన వైద్య సేవలు అందించాలి
కలెక్టర్ జితేష్ పాటిల్

జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 21: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. గురువారం కలెక్టర్ కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని మందులు అందించే గది, రక్త పరీక్ష కేంద్రం ఇన్ పేషెంట్ వార్డ్, ఫ్రీల వార్డ్ మందులు నిల్వ చేసే స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఇన్ పేషెంట్ వార్డ్‌లో ఉన్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఔట్ పేషెంట్ వివరాలు సిబ్బంది వివరాలు మందులు ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేశారు. కుక్క కాటు ఇచ్చే వ్యాక్సినేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఔషధ నిల్వలు స్టాక్ పెట్టుకోవాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు శుచికరమైన, బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యులు సిబ్బంది ఎందరు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని రకాల మందులు అందు బాటులో ఉంచాలని సూచించారు. ఈ తనిఖీలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ రాధా మోహన్, డ్యూటీ డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.



యువత నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఉపయోగకరం..

యువత నైపుణ్యాభివృద్ధికి ఏటీసీ మైలురాయిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తెలిపారు. బూర్గంపాడు మండలంలోని ఐటీఐ కృష్ణసాగర్ వద్ద ఏర్పాటు చేసిన అడ్వాన్స్డ్ ట్రెనింగ్ సెంటర్(ఏటిసి)ను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆధునిక పరికరాలు, శిక్షణ ల్యాబొరేటరీలు, వర్క్‌షాప్ విభాగాలు తరగతి గదులను పరిశీలించారు. తరగతి గదిలో ఉన్న విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు పొందుతున్న శిక్షణ సదుపాయాలపై స్పందనలు అడిగి తెలుసుకుని మరింత కృషి చేసి మంచి అవకాశాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు నేర్చుకుంటున్న పాఠ్యాంశాలు ప్రాక్టికల్ శిక్షణ



పద్ధతులు భవిష్యత్తు ప్రణాళికల గురించి ప్రశ్నలు అడిగి వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏటీసీ వంటి ఆధునిక శిక్షణ కేంద్రాలు యువతలో నైపుణ్యాలు పెంపొందించి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను విస్తరించడానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. తరగతి గదుల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, స్మార్ట్ బోర్డులు, డిజిటల్ లెర్నింగ్ సిస్టమ్స్ ద్వారా విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ పొందుతున్నారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి ఘాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



జనం పవర్, భైంసా, ఆగస్టు 21: నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల సోన్ మండల కేంద్రంలో ఉన్న గోదావరి పుష్కరఘాట్లను పరిశీలించారు. భారీ వర్షాల వలన గోదావరి ప్రవాహం, పంట నష్టం సర్వే, గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ అభిలాష్ అభినవ్ పలు సూచనలు చేశారు. గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. భారీ వర్షాలతో నష్టం జరిగిన పంటల సర్వే పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఏఎస్పీ రాజేష్ మీనా, ఆర్డీఓ రత్న కళ్యాణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

- లోకేశ్వరం ఎస్సై అశోక్



జనం పవర్, భైంసా, ఆగస్టు 21: లోకేశ్వరం మండలంలోని హవర్గ ఎక్స్ రోడ్ సమీపంలో గురువారం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను, కచ్చితంగా తమ వెంట తెచ్చుకోవాలని వాహనదారులకు సూచించారు. వాహన చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని వాహనదారులకు ఎస్సై హెచ్చరించారు. మైనర్లకు ద్విచక్ర వాహనం ఇవ్వకూడదని వివరించారు. మద్యం సేవించి వాహనాలను నడపకూడదని సూచించారు.

## విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

జనం పవర్, భైంసా, ఆగస్టు 21: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని మండల విద్యాధికారి విజయ్ కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ప్రైమరీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులకు అందుతున్న విద్య బోధనపై ఆరా తీశారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. మధ్యాహ్న భోజనం రుచిగా ఉండేటట్లు చూసుకోవాలని ప్రధానోపాధ్యాయుడికి తెలిపారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈవో సూచించారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలి

నర్సాపూర్ (జి) సిఐ కృష్ణ

జనం పవర్, భైంసా, ఆగస్టు 21: గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని నర్సాపూర్ (జి) సిఐ కృష్ణ సూచించారు. మండల కేంద్రంలో ఉన్న పెద్ద హనుమాన్ టెంపుల్‌లో గురువారం గణేష్ మండ పాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనంలో అధిక శబ్దంతో కూడిన డీజేలకు అనుమతి లేదన్నారు. ప్రతి ఒక్కరూ మండల కేంద్రం, ప్రతి గ్రామంలోని గణేష్ నిర్వాహకులు కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రే షన్ చేసుకోవడం వల్ల అధికారులకు సమాచారం తెలుస్తుందని, ప్రతి గ్రామానికి ఒక పోలీస్ అధికారి ఉంటారని, అధికారికి గణేష్ మండపాల సభ్యులు సంబంధిత కార్యక్రమాల గురించి తెలుపాలన్నారు. గణేష్ మండపాల గురించి గ్రామ కార్యదర్శి, విద్యుత్ శాఖ, సంబంధిత ప్రతి ఒక్క అధికారికి తెలియజేయాలన్నారు. గణేష్ నిమజ్జన విషయంలో ప్రతి ఒక్క గణేష్ మండలి సభ్యులు పోలీస్ అధికారులతో, ఎలక్ట్రిక్ సంబంధించిన అధికారులతో సహకరించాలని కోరారు. అన్ని మతాలతో కలిసిమెలిసి ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సంబంధిత కమిటీ మెంబర్లకు సూచించారు. ఈ సమావేశంలో నర్సాపూర్ (జి) ఎస్సై గణేష్, మండల తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టీషర్టుల పంపిణీ



జనం పవర్, భైంసా, ఆగస్టు 21: తానూర్ మండలంలోని మహాలింగి గ్రామ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఎంఈవో నరేందర్ టీ షర్టులను పంపిణీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న నవనీత భర్త సుమారు 50 మంది పేద విద్యార్థులకు టీ షర్టులను అందించారు. పేద విద్యార్థులకు తమ వంతు సహాయంగా టీ షర్టులను పంపిణీ చేసినట్లు నవనీత తెలిపారు. పేద విద్యార్థులకు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. పంపిణీ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పబ్జిగేమ్‌కు బానిసైన విద్యార్థి ఆత్మహత్య

- పాఠశాల మానేసి ఆటకే పరిమితం..
- మూడు రోజులుగా ఆడకుండా కట్టడి చేసిన తల్లిదండ్రులు..
- డిప్రెషన్‌తో ఉరి వేసుకున్న బాలుడు



జనం పవర్, భైంసా, ఆగస్టు 21: పబ్జి గేమ్‌కు బానిసగా మారిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన బుధవారం రాత్రి నిర్మల్ జిల్లా భైంసాలోని ఆనందనగర్ కాలనీలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన ప్రకారం..

హైదరాబాద్‌లోని మౌలాలి ప్రాంతానికి చెందిన వ్యక్తి సంతోష్ - సాయిప్రజా దంపతులు గత కొంతకాలంగా భైంసా పట్టణం ఆనందనగర్ కాలనీలో నివాసం ఉంటూ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బేతి రిసెంద్ర హైదరాబాద్‌లోని భాష్యం స్కూల్లో 9వ తరగతి పూర్తి చేసుకుని పదవ తరగతిలో చేరాల్సి ఉంది. అయితే రిసెంద్ర గత కొంతకాలంగా పబ్జి గేమ్‌కు బానిసగా మారాడు. ఇదే క్రమంలో చదువుపై నిర్లక్ష్యం చేసి పదవ తరగతికి పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండిపోయాడు. తల్లిదండ్రులు ఎన్ని విధాలుగా నచ్చజెప్పినా చదువుపై ధ్యాస పెట్టకుండా సమయం అంతా పబ్జి ఆడడంతోనే గడిపేవాడు. పబ్జి ఆటకు బానిసగా మారిన కుమారుడిలో మార్పు తెచ్చి చదువుపై దృష్టి పెట్టే దిశగా తల్లిదండ్రులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కానరాలేదు. చివరి ప్రయత్నంగా గత రెండు, మూడు రోజుల నుంచి కుమారుడికి కుటుంబీకులు పబ్జి గేమ్ ఆడకుండా కట్టడి చేశారు. దీంతో డిప్రెషన్‌కు లోనైన విద్యార్థి బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు భైంసా పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## కేజీబీవీ నూతన భవన నిర్మాణం లోపభూయిష్టం





జనంపవర్, మంచిర్యాల, ఆగస్టు 21: బాలికల విద్య మధ్యంతరంగా ఆగిపోవద్దన్న ఉద్దేశంతో కేజీబీవీ పాఠశాలల్లో ఇంటర్మీడియేట్‌ను నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధమైంది. కానీ కేజీబీవీల్లో సరిపోయే భవనాలు లేక పోవడంతో ప్రభుత్వం భవనాల నిర్మాణాలను చేపడుతోంది. అందులో భాగంగా ప్రభుత్వం రూ. మూడుకోట్ల ఇరవై ఐదు లక్షల వ్యయంతో నెన్నెలలోని కేజీబీవీలో భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. బెల్లంపల్లి నియోజక వర్గ ఎమ్మెల్యే శంకుస్థాపన చేయగా పనులు ప్రారంభించారు. అయితే ఆ భవనాల నిర్మాణం లోపభూయిష్టంగా కొనసాగుతోంది. కట్టడంలో నాణ్యత లేదు. వైబ్రేటింగ్ లేదు, కాంక్రీట్ మిశ్రమంలో మట్టి, ఇసుక శాతం అధికంగా ఉంది. పిల్లర్లను చేతితో తంటితే మూలలు విరిగిపోతున్నాయి. సరైన క్యూరింగ్ లేదు.

ఈ విషయమై సంబంధిత ఏఈ వినయ్‌ను సంప్రదిస్తే అంతా బాగానే ఉందని పేర్కొన్నారు. ఇలా నాసిరకంగా పనులు జరుగుతున్నా పట్టించుకునేవారు లేరా? ఇంజనీరింగ్ వ్యవస్థ ఏం చేస్తుందో అర్థం కాని పరిస్థితి. దీనిపై చర్యలు తీసుకునే వారు నిద్ర పోతుంటే భవిష్యత్తులో పిల్లల భవిష్యత్తు ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## పేదల ఇండ్ల స్థలాల అక్రమ పట్టాను రద్దు చేయాలి

బైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా




జనం పవర్, భైంసా, ఆగస్టు 21: బైంసా మండలంలోని హంపోలి గ్రామంలో పేదల ఇండ్ల స్థలాలను అక్రమంగా చేసిన పట్టాను రద్దు చేయాలని, అదే స్థలంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి సబ్ కలెక్టర్ అజ్మీర్ సంకేత్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జె.రాజు మాట్లాడుతూ 1983లో వరదల కారణంగా 16/అ, 16/ఆ సర్వే నెంబర్ లోని ఐదు ఎకరాల పట్టా భూమిని కొని ఎస్సీ, ఎస్టీలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆ భూమిలోని ఇండ్లను కూలగొట్టి అక్రమంగా పట్టా చేసుకోవడం జరిగిందని, ఈ అక్రమ పట్టాలను రద్దు చేయాలని తహసీల్దార్, ఆర్డీఓలు పై అధికారులకు నివేదికలు పంపినప్పటికీ రద్దు కాలేదని తెలిపారు. ఈ అక్రమ పట్టా చేసిన అప్పటి తహసీల్దార్ పైన చర్యలు తీసుకొని, అక్రమ పట్టాలను రద్దు చేయాలని, సర్వే నెం. 16/అ, 16/ఆ లను నిషేధిత భూముల జాబితాలో పెట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం హరీష, గ్రామస్తులు విఠల్ గంగారం, సాయినాథ్, సురేష్ బాబు, ఎల్లన్న, భోజన్న, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైని కలిసిన హిందూ ఉత్సవ సమితి కమిటీ



జనం పవర్, జన్నారం, ఆగస్టు 21: మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో గురువారం హిందూ ఉత్సవ సమితి నూతన కమిటీ సభ్యులు ఎస్సై, పోలీసులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా హిందూ ఉత్సవ సమితి సభ్యులు తమ సందేహాలను, అభ్యర్థనలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అత్తె రఘు, ప్రధాన కార్యదర్శి ఒడిపల్లి రాజేష్, గౌరవ అధ్యక్షుడు భూమన్న, కార్యదర్శి తుడుం జితేందర్, కోశాధికారి అప్పల జలపతి, సోషల్ మీడియా కన్వీనర్ గోనె సత్యం, నల్లపు కృష్ణ, పూర్ణాచారి, గోపాల్, కొముయ్య, బద్రినాయక్, సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను త్వరలో పట్టుకుంటాం

ముధోల్ సీఐ మల్లేష్

జనం పవర్, భైంసా, ఆగస్టు 21: తానూర్ మండలంలోని బోసి గ్రామంలో ఇటీవల ధ్వంసమైన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గురువారం ముథోల్ సీఐ మల్లేష్ పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని, దర్యాప్తును ముమ్మరంగా చేశామని తెలిపారు. ఎవరు కూడా చట్టాన్ని చేతులలోకి తీసుకోకూడదని ఎలాంటి కార్యాచరణ చేపట్ట వద్దన్నారు, అవసరమైతే పోలీస్ అధికారులకు సంప్రదించాలన్నారు. అతి త్వరలోనే నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీస్ అధికారులకు సహకరించాలని అన్నారు.

గ్రామంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తానూర్ ఎస్సై జుబేర్, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## చెన్నూరు ఎస్‌బిఐ క్యాషియర్ పరారీ

జనం పవర్, చెన్నూర్, ఆగస్టు 21: మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ఎస్బీఐ బ్రాంచ్-2 లో అవకతవకలు జరిగినట్లుగా అధికారులు గుర్తించారు. గురువారం ఉదయం నుండి బ్యాంకు మూసివేసి లోపల పోలీసులు బ్యాంక్ అధికారులను విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా బ్యాంకును రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా పరిశీలించారు. బ్యాంకు లోపల పరిశీలించిన సీపీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని, బ్యాంకు ఆడిట్ పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని సీపీ తెలిపారు. బ్యాంకు క్యాషియర్ రవీందర్ పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

# బాల భరోసా సర్వే పకడ్బందీగా చేపట్టాలి






- ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**జనం పవర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో ఆగస్టు 21:** బాల భరోసా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఐదు సంవత్సరాలలోపు పిల్లల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, తద్వారా ప్రత్యేక అవసరాలున్న వారిని గుర్తించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల భరోసా కార్యక్రమంపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలోని ఐదు సంవత్సరాల లోపు గల సుమారు 42 వేల మంది పిల్లల సర్వేను అంగన్వాడీ టీచర్లు, ఆర్బిఎస్కే సిబ్బంది చేపట్టారని తెలిపారు. 42 అంశాలతో కూడిన ప్రశ్నావళిని పూర్తి చేశారని, అయితే ఈ సర్వేను మరొకసారి సరి చూడాలని తెలిపారు. సర్వే సరిగ్గా చేయకపోతే ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించలేక పోతామని, తద్వారా వారికి ప్రభుత్వం అందించే వివిధ సేవలకు దూరమవుతారని అన్నారు. ప్రభుత్వం నుంచి బాల భరోసా కార్యక్రమానికి సంబంధించి పూర్తి మార్గదర్శకాలు వచ్చాక ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని తెలిపారు. ఆర్బిఎస్కే సిబ్బంది టీం వారీగా సర్వేను పునఃపరిశీలించాలని అన్నారు. భవితా కేంద్రాల్లోని ఐఆర్పీలు సైతం ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల వివరాలు సేకరించాలని అన్నారు. అతిగా బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఎన్ఆర్సి సెంటర్కి రిఫర్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సాజిత, పిఓ సనా, సిడిపివోలు సబిత, శ్రీమతి, నర్సింగారాణి, సుగుణ, ఐసిడిఎస్, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ధర్మారం పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన సీపీ




**ధర్మారం, ఆగస్టు 21:** పెద్దపల్లి జిల్లా ధర్మారం పోలీస్ స్టేషన్ ఆయన గురువారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పోలీసు అధికారులు పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కమిషనర్ పరిధిలో ఎలాంటి మాదక ద్రవ్యాల రవాణ జరగకుండా పోలీసు శాఖ అధ్వర్యంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝూ వెల్లడించారు. ముందస్తు వినాయక మండపాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి వినాయక ఉత్సవాలను నిర్వాహకులు ప్రశాంతంగా జరుపు కోవాలని ఆయన సూచించారు. నిర్వహకులు విద్యుత్ సౌకర్యం గురించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వినాయక మండపాల వద్ద ఫైర్ సేఫ్టీ ఏర్పాటు చేసుకొని భక్తులకు ఇబ్బంది కల గకుండా రాత్రిపూట మండపాల వద్ద కాపలా ఉండి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సూచించారు.

పెద్దపల్లి డిసిపి కరుణాకర్, ఏసీబీ జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్ ఎస్సై ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటం

## సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కామ్రేడ్ జి నాగయ్య

**జనం పవర్, మంథని, ఆగస్టు 21:** మంథని మండలంలోని సూరయ్యపల్లి కాకర్లపల్లి గ్రామాలలో సీపీఎం బృందం పర్యటించి ప్రజా సమస్యలను అధ్యయనం చేశారు. రెడ్డి చెరువు ప్రభుత్వ భూ ములను పరిశీలించి అక్కడనుండి కాకర్లపల్లి దళితులతో గ్రామం వరకు పాదయాత్ర నిర్వహించి గ్రామంలో సభ నిర్వహించారు. ప్రజలు సమస్యలతో కూడిన వినతి పత్రాలను సిపిఎం బృందానికి అందజేశారు. అనంతరం మంథని కేంద్రంలో ప్రజాసంఘాల కార్యాలయాన్ని కామ్రేడ్ నాగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కామ్రేడ్ జి నాగయ్య మాట్లాడుతూ రెడ్డి చెరువు ప్రభుత్వ భూములను భూమిలేని కాకర్లపల్లి నిరుపేద దళితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సూరయ్య పల్లి గ్రామంలో 40 మంది ముదిరాజు కుటుంబాలు ఉంటున్నాయని వీరి ప్రధాన వృత్తి చేపల పట్టడం కానీ వీరికి సొసైటీ చెరువు లేకపోవడం విచారకరమని అన్నారు. ప్రధాన వృత్తి లేకపోతే వీరి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు గత్యంతరం లేక వలసకూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించి వీరు చేపలు పట్టుకోవడానికి చెరువును చూపించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన భూములకు ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదని వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి ముదిరాజులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా చాలా




సమస్యలను ప్రజలు సిపిఎం బృందానికి మొరపెట్టుకున్నారని కొత్త పింఛన్లు ఇవ్వాలని పింఛన్లను పెంచాలని ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని గ్యాస్ బిల్లులు అందించాలని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సహాయం విడుదల చేయాలని ఇంకా గ్రామాలలో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని వీటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య కార్యదర్శి వర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ సిపిఎం నాయకులు ఆర్ల సందీప్ గొర్రెంకల సురేష్ మంథని లింగయ్య బాబు రవి నక్క శేఖర్ వివేక్ రాజయ్య బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మర్రిగడ్డ శివారులో రోడ్డు గుంతలమయం

## పట్టించుకోని అధికారులు



**చందుర్తి, ఆగస్టు 21:** వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిపై చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామ శివారు ఎల్లమ్మగుడి సమీపంలోని రోడ్డు గుంతలమయంగా మారింది. కోరుట్ల నుండి వేములవాడకు వచ్చే పోయే భారీ వాహనాలు, చిన్న వాహనాలు, ద్విచక్ర వాహన చోధకులకు ఇబ్బందిగా మారింది. ప్రతి సంవత్సరం ఇదే స్థలంలో రోడ్డుకు మరమ్మత్తులు చేయించినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ భారీ గుంతలు ఏర్పడ్డాయి. గణేష్ నవరాత్రోత్సవాలకు మెట్ పల్లి, కోరుట్ల నుండి వేములవాడకు ఈ మార్గం ద్వారా తమ తమ వాహనాలతో నిర్వాహకులు వినాయక విగ్రహాలను తెప్పించుకుంటున్నారు. ఈ ప్రధాన రహదారిలో గుంతలు ఉండ గా నిర్వాహకులు మరింత భయానికి గురవుతున్నారు. వేముల వాడ శ్రీ రాజరాజే శ్వరస్వామి దర్శనం కోసం కోరుట్ల నుండి నిత్యం వచ్చిపోయే వాహనాల వారికి ఇబ్బందికరంగా ఉంది. ప్రతి సంవత్సరం మహా శివరాత్రి జాతర మహోత్సవానికి వేములవాడ- కోరుట్ల ప్రధాన రహదారికి మరమ్మత్తులు చేయించి నప్పటికీ పూర్తిస్థాయి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రధాన రహదారిపై ఉన్న గుంతలు ప్రమాదాలకు పొంచి ఉన్నాయి. మర్రిగడ్డ శ్రీఎల్లమ్మ గుడి సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న గుంతలు పూర్తిస్థాయి తొలగించి శాశ్వతమైనతారు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

# సమాజ సేవలో కృషికి తగిన గౌరవం



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 21:** సమా జ సేవలో అహర్నిశలు కృషి చేస్తున్న సతీష్ యాదవ్‌కి ఈ విశిష్ట గౌరవం మరింత బలాన్నిస్తుంది. డాక్టరేట్ పొందిన అఖిల పక్ష ఐక్య వేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్ కు విడివిడిగా సన్మానం చేసిన పలు సంఘాల నాయకులు, మిత్రులు, ఆప్తులు. పలు సం వత్సరాలుగా మీ ఆశయాలు లేకున్నా ఆశలు లేకుండా ప్రజాసేవ చేస్తున్న సతీష్ యాదవ్‌కు ఇదొక కలికితురాయి అని ఆయన ప్రజల కోసం పడుతున్న కష్టానికి ఇది ఒక చిన్న కానుక అని ఎస్ఎల్ఎన్ రమేష్, బీసీనాయకురాలు మధులత దంపతులు పేర్కొన్నారు. రాబోవు కాలంలో సతీష్ యాదవ్ ఎన్నో మెట్లు ఎక్కాలని ఆశిస్తున్నామని తెలిపారు. అదే విధంగా అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ తరపున గౌరవ పూర్వకంగా శాలువాతో సన్మానించారు. స్టేట్ సెక్రటరీ జిటి.శ్యామ్, జిల్లా అధ్యక్షుడు సి.విశ్వంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు గద్వాల ఆంజనేయులు, జిల్లా జనరల్ సెక్రటరీ శైలన్‌కుమార్ పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన



**కాటారం, ఆగస్టు 21:** కాటారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏఈ ఉపేందర్ సమక్షంలో కాటారం, దేవరంపల్లి హైస్కూల్ విద్యార్థులకు విద్యుత్ భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ ఉపేందర్ విద్యార్థులకు విద్యుత్ పరికరాలను వాడేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. తడి చేతులతో పరికరాలను తాకరాదని, పాడైన వైర్లు వాడకూడదని, పిల్లలు స్విచ్ బోర్డులు, విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలని తెలిపారు. అలాగే ఎర్తింగ్ తప్పనిసరిగా ఉండాలని, షాక్ తగిలితే వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి ప్రథమ చికిత్స ఇవ్వాలని విద్యార్థులకు వివరించారు .ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో విద్యుత్ భద్రతపై అవగాహన పెంచి, ప్రమా దాలను నివారించుకునే మార్గాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# కాటారం మండలంలో వైద్యశిబిరాలు



**కాటారం,ఆగస్టు 21:** కాటారం మండలంలో సీజనల్ వ్యాధులు పెరు గుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వ ర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. వీరపూర్, విలాసాగర్,పోతులవాయి గ్రామాల్లో జరిగిన ఈ శిబిరాలలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు రోగనిర్ధారణ చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ ఎం.మౌనిక సూచనల మేరకు వైద్య బృందం ఈ కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించింది. ఈసందర్భంగా ప్రజలకు జ్వరం, డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గ్రామీణ ఆరోగ్య సిబ్బందిని సంప్రదించా లని వైద్యులు సూచించారు.


జ్వరమొచ్చిన వెంటనే ఆరోగ్య కేంద్రానికి సమాచారం అందించమని ప్రజలను కోరారు.

# అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

**రాజేంద్రనగర్, ఆగస్టు 21:** అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ అగ్రిమాపక అధికారుల నిర్వహించారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ కార్యాలయం, నార్కోటిక్స్ ట్రైనింగ్ సెంటర్లో అధికారుల ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది విన్యాసాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను కార్యాలయ సిబ్బందికి వివరించారు. విపత్కర సమయంలో కార్యాలయ భవనంలో అత్యవసర ద్వారాన్ని వినియోగించుకోవడం, వెంటనే చేపట్టాల్సిన చర్యలను సమావేశంలో అగ్నిమాపక అధికారులు తెలియపరిచారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఐఆర్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఫైర్ ఆఫీసర్, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్, రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు మిషన్ భగీరథ అధికారుల విజ్ఞప్తి

**కాటారం, ఆగస్టు 21:** కాటారం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు మిషన్ భగీరథ అధికారులు పలు సూచనలు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా భీమ్‌ఘనపూర్ చెరువులో మట్టి నీళ్లు అధికంగా చేరడంతో, కోణంపేట వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లో నీటి శుద్ధి ప్రక్రియలో అంతరాయం ఏర్పడుతోంది. దీని ఫలితంగా సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని కాటారం మండల మిషన్ భగీరథ ఏఈఈ (గ్రిడ్) వెంకటరామణ, పి. రాజశేఖర్ ఏఈఈ (ఎంబీ ఇన్‌ట్రా) గురువారం ప్రకటనలో తెలిపారు. అందువల్ల ప్రజలందరూ తాగునీటిని తప్పని సరిగా కాచి, చల్లార్చి, వడపోసుకుని త్రాగాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుత వర్షాకాల పరిస్థితుల్లో ఆరోగ్య భద్రత కోసం తాగునీటి వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలనీ అధికారులు సూచించారు.



### వేములవాడ- కోరుట్ల రహదారి వెంట

# విద్యుత్ వైర్లు సరిచేస్తున్న సిబ్బంది

**వేములవాడ, ఆగస్టు 21:** వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారి మండలంలోని కోనయ్యపల్లి- పోశెట్టిపల్లి గ్రామాల మధ్య విద్యుత్ వైర్లు వదువులుగా ఉండగా సెస్ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది వైర్లను సవరిస్తున్నారు. గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా మెట్ పల్లి, కోరుట్ల నుండి వేములవాడకు వినాయక విగ్రహాలను నిర్వాహకులు వాహనాలతో తరలిస్తున్నారు. గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా విగ్రహాలను తరిస్తుండగా హైదరాబాద్ లో ఐదుగురు విద్యుత్ ఘాతంతో మృతి చెందారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన నిర్వాహకులు కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి నుండి విగ్రహాన్ని తరలిస్తుండగా గంభీరావుపేట మండలంలో విద్యుత్ ఘాతంతో ఒక యువకుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటనల దృష్ట్యా వేములవాడ- కోరుట్ల ప్రధాన రహదారి వేములవాడ రూరల్ సెస్ అధికారులు సిబ్బందితో కరెంటు స్తంభాలను తొలగించి ఆదేస్తలాల్లో ఎత్తుగా పెంచి వైర్లు సవరిస్తున్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సెస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

# ఉపాధి రాతలో.. కాసుల మేత

## నెలలోపే నిర్మాణాలు శిథిలం



**జనం పవర్, భీమదేవరపల్లి, ఆగస్టు 21:** గ్రామాల్లో పేదల వలసలు నిరోధించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో ఏటా కోట్లాది రూపాయల పనులు చేస్తున్నారు. ఈ పనులకు సంబంధించిన వివరాలను రాత బోర్డులపై రాస్తున్నారు. అయితే ఆ బోర్డులు ఇష్టా రీతిగా నిర్మిస్తున్నారు. తూతు మంత్రంగా పనులు చేయడంతో ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్మించిన సగం దిమ్మెలు ఇప్పటికే కూలిపోయాయి. ఇక గతేడాది నిర్మించిన రాత బోర్డుల జాడే గ్రామాల్లో కనిపించడం లేదు. ఉపాధి పనుల ప్రదేశంలో అసలే కనిపించని ఈ బోర్డుల కోసం అధికార యంత్రాంగం కోట్లాది నిధులు ఖర్చు చేయడం విడ్డూరం.

**దిమ్మెల ఏర్పాటు ఇలా..**

ఉపాధి హామీ పని పూర్తయిన తరువాత క్షేత్ర స్థాయిలో పని వివరాలు తెలిపే రాత బోర్డు దిమ్మెలు ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం పనిని గుర్తించి ఎస్టిమేట్ చేసేటప్పుడు రాత బోర్డు ఖర్చు జనరేట్ అవుతుంది. రూ. లక్ష కంటే తక్కువ విలువ గల పనులకు రూ. 1300తో శాబాద్ బండపై వివరాలు రాయిస్తారు. రూ. లక్ష కంటే ఎక్కువ విలువ గల పనులకు రూ.4 వేలతో సిమెంట్ దిమ్మె ఏర్పాటు చేసి, దానిపై వివరాలు నమోదు చేయిస్తారు. ఆ దిమ్మె మూడు ఫీట్ల అడ్డం, 4 ఫీట్ల పొడవుతో నిర్మించాల్సి ఉంటుంది. అయితే వ్యక్తిగతంగా చేసిన పనులకు దిమ్మెలు, పలకలు ఏర్పాటు చేయరు.

**ఏం జరుగుతుందంటే..**

వార్షిక ఏడాదిలో ఉపాధిహామీ పనులు పూర్తయ్యాక క్షేత్ర స్థాయిలో రాత బోర్డుల దిమ్మెలు, పలకలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ బాధ్యతలు ఆయా గ్రామపంచాయతీ లేదా ఏదైనా ఏజెన్సీకి అప్పగిస్తున్నారు. వీరు పని ప్రదేశానికి వెళ్లి సిమెంట్ దిమ్మెలు, పలకలు ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేయించాలి. మండలంలోని చాలా గ్రామాల్లో ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో నిర్మించిన దిమ్మెలు నెల కూడా గడవక ముందే శిథిలం అయ్యి కూలిపోయాయి. గ్రామానికి దూరంగా నిర్మించిన దిమ్మెలకు వాటర్ క్యూరింగ్ చేయక పోవడంతో కూలిపోతున్నాయి. ఇలా ఏటా కోట్లాది నిధులు వృథా చేస్తున్నారు. ఉపాధి హామీ అధికారుల పర్యవేక్షణ లేక వాటి నాణ్యత గాడి తప్పుతోంది. పంచాయతీలు, ఏజెన్సీలు తూతు మంత్రంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్డులను పకడ్బందీగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**జనం పవర్, పటాన్‌చెరు, ఆగస్టు 21:** పటాన్‌చెరు నియోజకవర్గంలో గురుపూజోత్సవ వేడుకలను ఈసారి మరింత ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రకటించారు. సెప్టెంబర్ 8న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, సెప్టెంబర్ 13న ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించేందుకు జీఎంఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా వేడుకలు జరగనున్నాయి. నియోజకవర్గంలోని ప్రతి పాఠశాల నుంచి ఒక ఉద్యమ ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి గౌరవించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్ద కాలంగా పటాన్చెరును కేంద్రంగా చేసుకుని గురుపూజోత్సవం నిర్వహిస్తున్నామని, సమాజ మార్పు, అభివృద్ధిలో గురువుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. అదే విధంగా సెప్టెంబర్ 2, 3, 4 తేదీలలో మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ( ) ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రతి మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల నిర్వహణ కోసం ప్రతి మండలానికి 30 ేల రూపాయల చొప్పున సొంత నిధులను అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే, రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలకు పటాన్చెరును వేదికగా ఎంపిక చేయాలని ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఉషారాణికి విన్నవించామని, త్వరలోనే తుది నిర్ణయం వెలువడనుందని వెల్లడించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారులు పిపి రాథోడ్, నాగేశ్వరరావు నాయక్, కుమారస్వామి, సుధాకర్ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లు, ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బంజారా భవన్‌లో ఘనంగా తీజ్ ఉత్సవాలు



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 21:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బంజారా భవన్ లో గురువారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తీజ్ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బంజారా మహిళలతో కలిసి నృత్యం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోధుమలు తొమ్మిది రోజులు నానబట్టి పూజలు చేసి ఆచారంగా జరుపుకునే కార్యక్రమం ఈ తీజ్ ఉత్సవం అన్నారు. ఈ ఆచారం మన అందరి విశ్వాసం ప్రజల సంక్షేమం కోసం జరిగే కార్యక్రమం అన్నారు. తెలంగాణ మొత్తం ముఖ్యంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో పాడి పంటలతో, మంచి సమృద్ధి వర్షాలతో వాతావరణం ప్రకృతి సహకరించి, ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుడిని సేవాలాల్ మహరాజ్‌ను ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుదన్నారు. మీరంతా ఒక కూటమిగా ఉండాలని కోరారు.

## వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన



**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 21:** మద్నూర్ మండలం కేంద్రంలో గల ముదిరాజ్ సంఘము ఆధ్వర్యంలో రామాయణం రచయిత శ్రీ వాల్మీకి మహర్షి మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి ఎంత గొప్ప వారంటే చెప్పలేమన్నారు. వాల్మీకి మహర్షి కి త్రికాల దర్శిగా అంటారన్నారు. ముదిరాజ్ లకు గురువు గా కావడం ముదిరాజ్ ల అదృష్టం అని అన్నారు. ముదిరాజ్ కుటుంబ సభ్యులు ఎప్పుడు మంచి కోరుతారని అయన చెప్పారన్నారు. వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠించడం వలన ముదిరాజ్ లకు అభినందనలు తెలిపారు. గతంలో తాను ఎమ్మెల్యేగా వున్నప్పుడు మద్నూర్ ముదిరాజ్ సభ్యులు మాకు కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కావాలని వస్తే వారికీ స్థలం చూపించామన్నారు. ప్రతి వారం భజన భక్తితో పూజలు నిర్వహించాలని మాజీ శాసన సభ్యులు ముదిరాజ్ సభ్యులకు తెలిపారు.

# గడ్డపోతారంలో ఎఫ్ఎల్ఎస్ టీఎల్ఎం మేళా



**జనం పవర్, పటాన్‌చెరు (గడ్డపోతారం), ఆగస్టు 21:** జిన్నారం మండలంలోని గడ్డపోతారం మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం ఎఫ్ఎల్ఎన్ టిఎల్ఎం మేళాను మండల విద్యాధికారి కుమారస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సృజనాత్మక బోధనోపకరణాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

మండల విద్యాధికారి కుమారస్వామి విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు బోధనాభ్యసన సామగ్రిని తయారుచేయాలని సూచించారు. ఉపాధ్యాయులు తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సామాజిక శాస్త్రాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, నాటికలు, పాటలు వంటి విభాగాలలో విద్యార్థుల ప్రతిభ వెలికితీయాలని పిలుపునిచ్చారు. జిన్నారం జూనియర్ కాలేజ్ అధ్యాపకులు మాట్లాడుతూ ఆడుతూ పాడుతూ నేర్చుకునేలా బోధన సామాగ్రి తయారు చేయడం విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం పోటీ పరీక్షలు,సాంస్కృతిక ప్రదర్శనలు, క్రీడా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయుల ప్రదర్శనను జిల్లా స్థాయికి పంపించారు. వ్యాఖ్యాతగా కాశీనాథ్, న్యాయ నిర్ణయితలుగా వెంకన్న, నాదీమ్, మొగులయ్య పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, కవిత, శ్రీదేవి, మృదుల, పీఆర్టీయూ సంఘం నాయకులు అనిల్, పవన్, ప్రదీప్ పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేస్తా



**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 21:** ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. మద్నూర్ మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర స్థాపన మహోత్సవంలో పాల్గొన్నారు. బీసీ కాలనీ కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్ కమ్యూనిటీకి పెద్ద పీఠ వేస్తుందని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో కూడా ముదిరాజ్ కమ్యూనిటీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని, వారి సమస్యలను పరిష్కరించడమే గాక అన్ని విధాలుగా అండగా ఉంటానని, ముదిరాజ్ లకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తానని భరోసా ఇచ్చారు.ముదిరాజ్ సంఘం భవనం కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే రూ.20 లక్షలు మంజూరు చేశారు.

## డయగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**జనం పవర్, పటాన్‌చెరు (భీరాంగూడ) ఆగస్టు 21:** అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో వారాహి డయగ్నోస్టిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో డయగ్నోస్టిక్స్ సెంటర్లు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆధునిక పరికరాలతో ప్రజలకు తక్కువ ధరల్లో వైద్య పరీక్షలు అందుబాటులో ఉండటం స్థానికులకుఉపయోగం అని అన్నారు. బీరంగూడ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని బీరంగూడ చుట్టుపక్క ప్రాంతాల వారికి రేడియాలజీ గైనిక్ సేవలను అందుబాటులోకి తెచ్చామని, సద్వినియోగం చేసుకోవాలని డయాగ్నొస్టిక్ నిర్వాహకులు అన్వేష్ రెడ్డి, కోలాన్ రామకృష్ణారెడ్డిలు తెలిపారు.

## గరుడ వాహనం విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన



**జనం పవర్, బెజ్జంకి, ఆగస్టు 21:** గరుడ పక్షి మహావిష్ణు వాహనం వేగానికి శక్తికి ప్రతీక శక్తివంతమైన గరుడ వాహనం విగ్రహం నిర్మాణం బెజ్జంకిలో నిర్మించడం సంతోషకరమని నిర్మాణ కమిటీ అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మణ్ అన్నారు. గురువారం గరుడ వాహన పక్షి విగ్రహ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం అలిపిరిలో ఉన్నటువంటి గరుడ వాహన విగ్రహ నమూనాను బెజ్జంకిలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. మిత్రుల సహకారంతో విగ్రహ నిర్మిస్తున్నామన్నారు. గరుడ పక్షి విష్ణు వాహనమన్నారు. ఈ విగ్రహం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుందని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి ప్రసాద్, అన్నల్దాస్ మల్లేష్, బూర్గు ల రాజు, కమటం శ్రీనివాస్, సిద్ధి మాణిక్, బోనగిరి శేషు కుమార్ పాల్గొన్నారు

## రాచూర్‌లో మెడికల్ క్యాంపు ఏర్పాటు



**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 21:** మద్నూర్ మండలం రాచూర్ గ్రామంలో ప్రజలు అనారోగ్యంతో బాధపడుతుండగా.విషయం తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు తక్షణమే స్పందించి రాచూర్ గ్రామానికి వెళ్లారు. ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి ప్రజల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని, వెంటనే వైద్య అధికారులకు ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. వైద్యుల బృందాన్ని గ్రామానికి పిలిపించి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. వైద్యుల బృందం అనారోగ్యానికి గురైన వారికి పరీక్షలు చేసి, వైద్యం అందించి, మెడిసిన్ ఇస్తున్నారు.వైద్యుల సూచన మేరకు కొంతమంది పేషంట్స్ ను మద్నూర్ మండల కేంద్రంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ కు పంపిస్తున్నారు.

## ఎమ్మెల్యేకు సన్మానం

**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 21:** మద్నూర్ మండల కేంద్రంలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును కుర్మ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇటీవల వరదలు ఏర్పడినప్పుడు పలువురిని కాపాడినందుకుగాను ఏర్పాటు చేసిన కార్యక్రమలో ఆయనను సన్మానించారు.

## మద్యం టెండర్లలో గౌడ్‌లకు 25 శాతం ఇవ్వాలి

### -జుక్కల్ నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ ఇంచార్జి శివ గౌడ్



**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 21:** కామారెడ్డి జిల్లా జుక్కల్ మద్యం టెండర్లను ప్రభుత్వం గౌడ్ కులస్థులకు ఇస్తామన్నా 25 శాతం షాపులు ఇవ్వాలని జుక్కల్ నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ ఇంచార్జ్ శివ కుమార్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే ఇప్పుడున్న 15శాతం మద్యం షాపుల నుండి 25 శాతం వరకు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. మళ్లీ పాత పద్ధతిని కొంసాగించడం పద్దది కాదన్నారు.

# జైపూర్‌లో ప్రభుత్వ అధికారులతో 'జనం పవర్' ఆవిష్కరణ

**జనం పవర్, జైపూర్, ఆగస్టు 21:** జైపూర్ మండలంలో ఏసీపి వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీధర్, తహసీల్దార్ వనజ రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాబురావు 'జనం పవర్' పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పత్రికలు ప్రజల సమస్యలను వెలుగులోకి తేవడంలో, ప్రభుత్వానికి వాటిని చేరవేయడంలో వారధిగా పాత్ర పోషిస్తాయని, పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణమని పేర్కొన్నారు. పత్రికలు ఎంత స్వచ్ఛందంగా, ఎంత నిర్భయంగా, ఎంత నిష్పాక్షికంగా వాస్తవాలను రాస్తాయో అంతగా వాటికి ప్రజల్లో గౌరవం, విశ్వాసం, చిరస్థాయి గుర్తింపు లభిస్తుందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ సందేశాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. నిజాయితీ పాత్రికేయుని ధైర్య స్వభావానికి నిదర్శనమని ప్రశంసించారు. ప్రభుత్వ వ్యవస్థలో అప్పుడప్పుడు తప్పులు జరిగితే వాటిని సవరిస్తూ పోతే ప్రజాభిమానాన్ని పొందవచ్చని, కానీ సవరణ చేయకుండా ఉంటే ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుందని హెచ్చరించారు. పాత్రికేయులు ఎల్లప్పుడూ ప్రజల సమస్యలపై పోరాడాలని, కానీ వ్యక్తిగత స్థాయిలో విమర్శలు చేయకూడదని సూచించారు. నిజాలను ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం కాబట్టి పత్రికా స్వేచ్ఛను కాపాడి, పాత్రికేయుల గొంతుక మరింత బలంగా వినిపించేలా చేయాలని స్పష్టం చేశారు. మీ కలం నిజాన్ని ప్రజలకు తెలిసేలా చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ మండల జనం పవర్ విలేకరి మంతెన సతీష్, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా విలేఖరి వేల్పుల నగేష్, డిజిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తాళ్లపల్లి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






## గణేష్ నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా భద్రత ఏర్పాట్లు చేయాలి

**- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 21:** గణేష్ నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా భద్రత ఏర్పాట్లు చేయాలని, డిజే సౌండ్ అధిక శబ్దం చేస్తే డిజే సౌండ్ సిస్టంలపై పూర్తిస్థాయి నిషేధిస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం నేర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ జిల్లాలో పోలీస్ స్టేషన్ల యొక్క పనితీరును, కేసుల చెదనలో సాధించిన పురోగతిని అంచనా వేసుకుంటూ రానున్న కాలంలో దృఢ నిశ్చయతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. డిఎస్పీలు, సిఐలు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లను తరచు సందర్శిస్తూ నమోదైన వివిధ రకాల కేసులు యొక్క స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత ఎస్ఐలకు కేసుల దర్యాప్తునకు సంబంధించి సూచనలు ఇవ్వాలని సూచించారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రహదారులపై ధర్నాల పేరుతో ప్రజారవాణాకు, సామాన్య ప్రజానికానికి ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని,పెట్రోలింగ్ చేసే సమయంలో, అనుమానిత వ్యక్తులను, పాత నేరస్తులను,రౌడి షీటర్స్‌ని తనిఖీ చేయాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజు వాహనాల తనిఖీ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో గంజాయి సరఫరా చేసే మూలాలను, కీలక వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి అక్రమ రవాణా పకడ్బందీగా నియంత్రించాలన్నారు. అక్రమ కార్యకలాపాలైన మట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట, గుడుంబా, పిడిఎస్ రైస్, వాటిపై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలని సూచించారు. సెప్టెంబర్ 13న జరిగే జాతీయ మెగా లోక్ ఆదాలత్‌ని ప్రజలు సద్వినియోగం చేసుకునేల అవగాహన కల్పించాలని, గుర్తించిన పెండింగ్ కేసులల్లో అన్ని పరిష్కరం అయ్యే విధంగా ప్రతి అధికారి కృషి చేయలని సూచించారు.

రానున్న గణేష్ నవరాత్రోత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో ఎస్ఐలు, సిఐలు ముందుగానే సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించాలన్నారు. గణేష్ వేడుకల్లో ఎక్కడా శాంతిభద్రతల సమస్య రానివ్వవద్దని, ఈ విషయంలో అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. విగ్రహాల ప్రతిష్టపన నుండి నిమార్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలాల వారిగా నిమజ్జనం జరిగే ప్రదేశాలను గుర్తించి భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. గణేష్ మండపాల వద్ద, శోభాయాత్రలో నిబంధనలు విరుద్ధంగా డిజే లు, అధిక శబ్దాలు చేసే సౌండ్ సిస్టంల పై పూర్తి స్థాయిలో నిషేధం ఉందని, నిబంధనలు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే డిజే యజమానులతో పాటు మండపాల నిర్వహకులపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరం మేరకు చిన్న స్పీకర్లు పోలీస్ వారి అనుమతితో ఏర్పాటు చేసుకోలని ఎస్పీ పేర్కొన్నారు.

ఈసమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన సింగిల్ విండో చైర్మన్

**సిరిసిల్ల, ఆగస్టు 21:** వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంఛార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కృష్ణదేవరావును ఆది శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రేగులపాటి కృష్ణదేవరావు మాట్లాడుతూ గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రతి క్షణం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఏ బాధ్యత ఇచ్చిన నెరవేరుస్తూ ముందుకు పోతానని పేర్కొన్నారు.

# సింగరేణి గిరిజన ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

**రూరల్ డెవలప్‌మెంట్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ మంత్రి సీతక్క**



**జనం పవర్ జైపూర్, ఆగస్టు 21:** సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సెంట్రల్ కమిటీ కొత్తగా ఎన్నికైన సభ్యులు గురువారం మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ధరావత్ పంతుల, జనరల్ సెక్రటరీ భూక్య నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ మంత్రి దనసరి సీతక్క, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

కమిటీ సభ్యులు మాట్లాడుతూ సింగరేణిలో గిరిజన ఉద్యోగుల సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ముఖ్యంగా క్లస్టర్, ఇంటర్ క్లస్టర్ ప్రమోషన్లలో అన్యాయం జరుగుతోందని, అలాగే రోస్టర్ రిజిస్టర్ వెరిఫికేషన్, ప్రమోషన్ పాలసీకి సంబంధించిన అంశాలు త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘానికి సీతక్కను గౌరవ అధ్యక్షురాలిగా ఉండాలని అభ్యర్థించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముందుగా కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సమస్యలు సమగ్రంగా డాక్యుమెంటరీ రూపంలో అందిస్తే ప్రత్యేకంగా ఒక సమావేశం ఏర్పాటు చేసి అన్ని అంశాలపై పరిష్కారం చూపేలా చూస్తామని అన్నారు. గిరిజన ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లైజాన్ ఆఫీసర్ వీసం కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ దశరథ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోకాళ్ళ తిరుమల్ రావు, జిఎం (సివిల్) వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే అండర్ బ్రిడ్జిలో ప్రాణాలు పోతే బాధ్యులు ఎవరు..?

- **డేంజర్ స్పాట్ గా మారిన రహదారి**
- **బయటికి పొడుచుకొచ్చిన ఇనుప చువ్వలు**
- **బ్రిడ్జి మధ్యలో వేలాడుతున్న నెట్ కేబుల్స్**
- **మరమ్మతులు చేపట్టాలని స్థానికుల డిమాండ్**

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 21:** రైల్వే అండర్ బిడ్జి డేంజర్ స్పాట్‌గా నిలిచిందని ఇందులో ప్రాణాలు పోతే ఎవరు బాధ్యులంటూ ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అండర్ బ్రిడ్జి మధ్యలో రహదారి ప్రమాదకరంగా కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులకు కనిపించడం లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. రోడ్డు మధ్యలో ఇనుప చువ్వలు పైకి పొడుచుకొని ఉండడంవల్ల వాటితో గాయాలతో పాటు ప్రాణాలు కూడా పోయే అవకాశం కనిపిస్తున్న సంబంధిత శాఖల అధికారులలో చలనం లేకపోవడం విచారకరమని ప్రజలు మండిపడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రహదారి మధ్యలో కంకర కొట్టుకుపోయి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. మరమ్మతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం విచారకరమని, ప్రాణాలు పోతే తప్ప అధికారులు స్పందించే పరిస్థితి కనబడడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇనుప చువ్వల వల్ల ఎవరికైనా ప్రమాదం జరిగితే అధికారులే బాధ్యత వహించాలని వాహనదారులు హెచ్చరిస్తున్నారు.



### వేలాడుతున్న ప్రైవేట్ కేబుల్ వైర్లు..

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రవేట్ కేబుల్ వైర్లు కిందకు వేలాడుతూ ఉండడంవల్ల ప్రమాదం పొంచి ఉంది. చేతికి అందెత్తులో వైర్లు వేలాడుతున్న అధికారులకు కనిపించడం లేదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కేబుల్ వైర్లతో హైదరాబాదులో ప్రమాదం జరిగిన సంఘటన అందరికి తెలిసిందే. అక్కడున్న తరహాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి మధ్యలో కేబుల్ వైర్లు కిందికి వేలాడుతూ కనిపిస్తున్నాయి. వీటితో ప్రాణాలు పోకముందే అధికారులు వైర్లను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా బ్రిడ్జి మధ్యలో వర్షాలకు ఇసుక పేరుకుపోయి ఉందని దీనివల్ల ద్విచక్ర వాహనాలు స్కిడ్ అయి కింద పడుతున్న పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుకతో కింద పడడం వల్ల వెనుక నుండి వచ్చే వాహనాలతో ప్రాణాలు కూడా పోయే అవకాశం ఉందని ఈ విషయాన్ని గమనించి అధికారులు బ్రిడ్జి మధ్యలో రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# పల్లె రహదారులు బొందలమయం.. పట్టణ వీధులు గుంతలమయం..

- **కొత్తగా నిధులు తెచ్చేది లేదు.. పాత నిర్మాణాలను పట్టించుకునేది లేదు..**
- **మందమర్రి అభివృద్ధికి గ్రహణం పట్టిందంటున్న ప్రజలు**

**(జనం పవర్, మందమర్రి)**

మంచిర్యాల జిల్లా మందమర్రి మున్సిపాలిటీ, మండల పరిధిలోని గ్రామాలు గత కొంతకాలంగా ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోవడం లేదని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. అధికార పార్టీ పాలనలోకి వచ్చి 18 నెలలు గడిచినా ఇప్పటి వరకు మందమర్రి పట్టణం, మండల పరిధిలో ప్రజా సంక్షేమం కోసం ఒక్క కార్యక్రమం చేపట్టిన దాఖలాలు కనబడట్లేదని అంటున్నారు. మండలంలోని గుడిపల్లి, వెంకటపూర్ రహదారి యమలోక వారధిగా మారింది. అదిల్ పేట్ మూలమలుపు ప్రమాదంగా మారింది. శంకర్ పల్లి గ్రామానికి గత 40 ఏళ్ల నుండి రహదారి లేక, అక్కడి ప్రజలు అరిగోస పడుతున్నారు. వీటికి తోడు ఈ పల్లె బడుల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మందమర్రి మున్సిపాలిటీ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం ఎప్పుడు కూలిపోతాయో తెలియదు. వర్షానికి పైకప్పు పెచ్చులూడుతూ ముఖ్యమైన పత్రాలు నానుతున్నాయి. ప్రభుత్వ ఐటిఐ కళాశాల చుట్టూ.. ప్రహరీ గోడ కరువై, నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతోంది. ఎంపీడీవో కార్యాలయం చుట్టూ ఏపుగా పెరిగిన చెట్లు, కార్యాలయ పరిసరాలు చెత్తాచెదారం నిండింది. ఇదే కార్యాలయానికి అనుకొని ఉన్న ప్రాంతంలో ఇందిరమ్మ నమూనా గృహం నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయి ఉన్నాయి.



మందమరి పట్టణంలోని 24 వార్డులలో ఏనాడో వేసిన రోడ్లు ప్రయాణానికి అనువుగా లేక అడుగడుగున గుంతలు నిండిపోయాయి. వీధుల్లో ఉన్న కల్వర్టులు ఎప్పుడు కూలిపోతాయో తెలియదు. రైల్వే స్టేషన్ దారి ఏపుగా పెరిగిన చెట్ల పొదలతో.. విషపు సర్పాలు, వింత పురుగులు దారిపైకి వస్తూ.. చీకట్లో ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీటి గురించి అధికారులు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. పట్టణ జనాభాను దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వ హయాంలో ప్రజలందరికీ జీవనోపాధి లభించాలని ఎంతో అట్టహసంగా కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు నిలిపివేశారు. పట్టణ ప్రజలు సేదతీరడానికి ఏర్పాటు చేసిన పార్కు పనులు ప్రారంభించడం లేదు.



ప్రత్యక్షంగా.. పరోక్షంగా.. 40,000 మందికి జీవనోపాధి కలిగించే లెదర్ పార్కు కనుమరుగయ్యే ప్రమాదంలో ఉంది. లెదర్ పార్కు ప్రారంభ దిశకు అడుగులు వేయడం లేదు. మొన్న కురిసిన భారీ వర్షాలకు పట్టణంలో, గ్రామాలలో ఇండ్లు కూలి కొందరు పంటలు మునిగి గోస పడుతుంటే కనీసం వారిని పలకరించిన దాఖలాలు లేవు.

మండలంలోని గ్రామాలు, పట్టణంలో మురికి కాలువల నిర్మాణాలు, రోడ్ల నిర్మాణాలకు ఇటీవల నిధులు విడుదల చేసి, ఎలాంటి అనుభవం లేనివారికి పనులు అప్పజెప్పారు. అవి నాలుగు రోజులు నిలవలేదు. 70 వేల జనాభా ఉన్న మందమర్రి పట్టణంలో మరణిస్తే దహన సంస్కారాలు చేయడానికి స్మశాన వాటిక లేదు, సరిపడా వైకుంఠ రథాలు లేవు. మండలానికి ఒక 108 వాహనం లేదు. ఇటీవల 108 వాహనం అందుబాటులో లేక వివిధ కారణాలతో ఇద్దరు వ్యక్తులు మరణించారు. పట్టణంలో ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటల్ని ఆర్పడానికి ఫైర్ ఇంజన్ లేదు. గత సంవత్సరంలో.. ఫైర్ ఇంజన్ అందుబాటులో లేక రెండు షాపులు కాలిపోయాయి.



సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామంటూ.. గత పాలకులు, ప్రస్తుత పాలకులు మాయ మాటలు చెబుతూ.. కాలం గడుపుతున్నారని పట్టణ మేధావులు, విద్యావేత్తలు, కుల సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మందమర్రి పట్టణ, మండలంలో ఉన్న సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే, కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ, మండల ప్రభుత్వ అధికారులు, స్థానిక నాయకులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మళ్లీ ఇన్నేళ్లకు ఒకే చిత్రంలో?

'కూలీ' తర్వాత లోకేశ్ కనగరాజ్ చేయాల్సిన సినిమాలు చాలానే ఉన్నాయి. తాను ఇదివరకు తీసిన 'ఖైదీ'కి కొనసాగింపుగా 'ఖైదీ 2', హిందీలో అమిర్‌ఖాన్‌తోనూ ఓ సినిమా చేయాలనుకున్నారు. ఆ విషయాల్ని ఇదివరకు లోకేశ్ స్వయంగా ప్రకటించారు. 'కూలీ' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇంతలోనే లోకేశ్ తదుపరి చేయనున్న కొత్త సినిమాపై తమిళ చిత్ర పరిశ్రమలో ఆసక్తికరమైన చర్చ కొనసాగుతోంది. ఆయన ఖరారు చేసిన రెండు సినిమాలకంటే ముందుగా మరోసారి రజనీకాంత్‌తోనే సినిమా చేయనున్నారని, ఈసారి ఆయనకు తోడుగా కమల్‌హాసన్ కూడా అందులో కథానాయకుడిగా నటిస్తారని ప్రచారం సాగుతోంది. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ సినిమాని తెరకెక్కించనున్నారని, రజనీ - కమల్ ఇద్దరూ గ్యాంగ్‌స్టర్లుగానే సందడి చేయనున్నారని సమాచారం. ఇదే నిజమైతే 46 ఏళ్ల తర్వాత రజనీ-కమల్ మళ్లీ కలిసి కెమెరా ముందుకు వచ్చినట్టవుతుంది. ఈ ఇద్దరూ పలు భాషల్లో కలిసి 20కిపైగా సినిమాలు చేశారు. అయితే అదంతా 1970 దశకంలోనే. ఆ తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ తెరను పంచుకునే అవకాశం రాలేదు. ఇన్నేళ్లకు లోకేశ్ రాసిన కథ ఈ ఇద్దరినీ మళ్లీ కలుపుతోందని తమిళ సినీ వర్గాలు చెబుతున్నాయి.






# తెరపై విఠాబాయిగా శ్రద్ధా కపూర్!

'స్త్రీ 2'తో భారీ విజయాన్ని సొంతం చేసుకొని విమర్శకుల ప్రశంసలు అందుకుంది బాలీవుడ్ అందాల తార శ్రద్ధా కపూర్. ఈ సినిమా విడుదలై ఏడాది కావొస్తున్నా.. ఇప్పటికీ ఆమె తన తదుపరి ప్రాజెక్టును ప్రకటించలేదు. మహారాష్ట్ర జానపద ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన విఠాబాయి భావు మంగ్ నారాయణ్ గావ్‌కర్ బయోపిక్‌లో శ్రద్ధ నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ ప్రాజెక్టు గురించి మరో విషయం నెట్టింట్లో చక్కర్లు కొడుతుంది. తాజాగా ఈ దీనికి 'విట్టా' అనే పేరును ఖరారు చేసినట్లు సమాచారం. దినేశ్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'ఛావా' ఫేమ్ లక్ష్మణ్ ఉటేకర్ దర్శకుడు. పుణెలో ఉన్న విఠాబాయి కుటుంబం నుంచి ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన హక్కులను పొందినట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.




## స్పోర్ట్స్




# బ్రసెల్స్ డైమండ్ లీగ్‌కు నీరజ్ దూరం

డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు ఇప్పటికే అర్హత సాధించిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా బ్రసెల్స్‌లో జరిగే చివరి డైమండ్ లీగ్ (22న) అంచెకు దూరం కావాలని నిర్ణయించుకున్నాడు. మొత్తం 14 డైమండ్ లీగ్ టోర్నీల్లో నాలుగింట్లో జావెలిన్ త్రో పోటీలను నిర్వహిస్తారు. అందులో రెండు టోర్నీల్లో పోటీపడిన నీరజ్.. ఆగస్టు 28న జ్యూరిచ్‌లో జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. దోహా డైమండ్ లీగ్‌లో 90.23 మీటర్ల ప్రదర్శనతో నీరజ్ రెండో స్థానంలో నిలిచాడు. పారిస్ డైమండ్ లీగ్‌లో 88.16 మీటర్లతో అగ్రస్థానం సంపాదించాడు.

# ఒలింపిక్స్ కోసం బిడ్ వేయండి.. సహకరిస్తాం: భారత్‌కు ఆస్ట్రేలియా మద్దతు



భారీ క్రీడా సమరాలను నిర్వహించేందుకు భారత ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ఒలింపిక్స్ 2036 నిర్వహణ కోసం భారత ప్రభుత్వం బిడ్ వేసేందుకు సిద్ధమైంది. మరికొన్ని రోజుల్లో బిడ్డింగ్ ప్రక్రియ మొదలుకానుంది. అహ్మదాబాద్ ప్రధాన కేంద్రంగా క్రీడల నిర్వహణ కోసం భారత్ ఏర్పాట్లు చేయనుంది. అయితే, ఈ విషయంలో ఏమైనా సహాయసహకారాలు అవసరమైతే అందించడానికి తాము సిద్ధమని ఆస్ట్రేలియా ప్రకటించింది. భారీ క్రీడా సంగ్రామం నిర్వహణలో నమ్మకమైన భాగస్వామిగా ఉంటామని హామీ ఇచ్చింది. దీనితో ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగవుతాయని వెల్లడించింది. ఈమేరకు ఆస్ట్రేలియా హై కమిషనర్ ఓ కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ''ఆస్ట్రేలియా 2032 ఒలింపిక్స్‌ను నిర్వహించనుంది. మరోవైపు భారత్ ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్‌తోపాటు ఆసియా గేమ్స్ నిర్వహణ కోసం సిద్ధమవుతోంది. ఇరుదేశాల మధ్య దీనిపై చర్చలను విస్తృతం చేయాలని అనుకుంటున్నాం. భారత్‌తో మంచి భాగస్వామ్యం కలుగుతుందని మేం భావిస్తున్నాం. భారీ క్రీడా సంబరాలు నిర్వహించిన అనుభవం మాకుంది. గత ఒలింపిక్స్‌లోనూ మా అథ్లెట్లు అద్భుతాలు చేశారు. పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచాం. పెద్ద టోర్నీలను ఎలా నిర్వహించాలో భారత్‌కు తెలుసు. అయితే, ఒలింపిక్స్ వంటి మహా క్రీడాసంగ్రామం ఎన్నో విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. స్టేడియాల నిర్మాణం, మార్కెటింగ్, భద్రత, టికెట్ల అమ్మకం, అథ్లెట్లకు ఏర్పాట్లు.. ఇలా చాలా అంశాలు ప్రభావితం చేస్తాయి. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రీడా మైదానాన్ని ఆస్ట్రేలియా సంస్థ డిజైన్ చేసింది. ఒలింపిక్స్‌ను నిర్వహించడంలో పెద్ద ఇబ్బందేమీ ఉండదు'' అని హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్ వెల్లడించారు.

**ఆస్ట్రేలియా అనుభవం ఇదీ..**

ఆస్ట్రేలియా ఇప్పటివరకు రెండుసార్లు ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చింది. మెల్‌బోర్న్ వేదికగా 1956లో, సిడ్నీలో 2000లో ఒలింపిక్స్ పోటీలు జరిగాయి. ఇప్పుడు మూడోసారి సిద్ధమవుతోంది. ఇక 1982, 2006, 2018లో కామన్వెల్త్ గేమ్స్‌ను నిర్వహించింది. ఈనేపథ్యంలో భారత్‌కు ఒలింపిక్స్ నిర్వహణ విషయంలో సహాయసహకారాలు అందించేందుకు మద్దతు తెలిపింది.

PRINTED PUBLISHED,OWNED BY G.THIRUPATHI,PRINTED AT SRK PRINTERS (V)KOKKERAKUNTA (M)RAMADUGU (D)KARIMNAGAR 505001.TELANGANA,
PUBLISHED FROM H.NO 10-6-219, KISAN NAGAR,KARIMNAGAR 505001,TELANGANA.RNI NO TEL TEL/2016/69862, EDITOR:BANDARI MARUTHI.